


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267    తెలుగు దినపత్రిక




సంపుటి : 05 సంచిక : 130 పేజీలు : 8    శనివారం18-10-2025 వెల : 5/-

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD


## పార్టీ కోసం ఆస్తులు అమ్మినా, అయినా మోసం చేసింది

### –కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



మంత్రి పదవి విషయంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి బరస్ట్ అయ్యారు.పార్టీ కోసం ఆస్తులు అమ్ముకుని కష్టపడి పనిచేశానని పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. తనకు మంత్రి పదవి రాకుండా కొందరు అడ్డుకుంటున్నారంటూ ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికి నాతోపాటు బీజేపీ నుంచి వచ్చిన వారికి మంత్రి పదవులు ఇచ్చి తనను పక్కనపెట్టారంటూ మండిపడ్డారు. ప్రస్తుతం కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యవహారం పార్టీకి ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికే కొండా సురేఖతోపాటు కొందరి మంత్రుల మధ్య జరుగుతున్న విభేదాల నేపథ్యంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి.

## హైదరాబాద్‌లోని పలు ఫారెక్స్ సంస్థల్లో ఈడీ తనిఖీలు




### –ఆర్బీఐ లైసెన్స్ లేకుండా సంస్థలను నిర్వహిస్తున్నారని ఫిర్యాదులు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)హైదరాబాద్ నగరంలోని పలు ఫారెక్స్ సంస్థలపై ఈడీ అధికారులు దాడులు నిర్వహించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి లైసెన్స్ లేకుండానే ఈ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయనే ఫిర్యాదుల మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. ప్రిజమ్, గరుడ, విక్టరీ, విమల్‌నాథ్ ఫారెక్స్ సంస్థల్లో ఈడీ అధికారులు సోదాలు జరిపారు. గతంలో ఆర్బీఐ అధికారులు జరిపిన సోదాల్లో ఈ సంస్థల్లో అవకతవకలు వెలుగుచూడటంతో, ఈడీ కూడా తనిఖీలు చేపట్టింది. ఆర్బీఐ అనుమతులు


మిగతా 2లో

## స్థానిక ఎన్నికలు ఎప్పుడు.?

# రెండు వారాల్లో చెప్పండి

## ప్రభుత్వానికి, ఈసీకి తెలంగాణ హైకోర్టు ఆదేశం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న సందిగ్ధతపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో రెండు వారాల్లోగా స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీ) ఆదేశించింది. ఈ అంశంపై ప్రభుత్వం, ఎన్నికల సంఘం కలిసి చర్చించుకుని ఒక నిర్ణయానికి రావాలని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు కొట్టివేయడంతో, స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల సంఘం ఇటీవల నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఈసీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సురేందర్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా, సుప్రీంకోర్టు కూడా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని చెప్పింది కదా అని హైకోర్టు గుర్తు చేసింది.దీనిపై ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది స్పందిస్తూ, సుప్రీంకోర్టు కేవలం




మౌఖికంగా మాత్రమే చెప్పిందని, లిఖితపూర్వక ఆదేశాల్లో ఆ ప్రస్తావన లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల ఆధారంగా నోటిఫికేషన్ ఇచ్చామని, అది చెల్లకపోవడంతోనే నిలిపివేశామని వివరించారు. రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వంతో చర్చించి, స్పష్టత వచ్చిన తర్వాతే కొత్తగా నోటిఫికేషన్ జారీ చేయగలమని తెలిపారు. ఈ ప్రక్రియ కోసం కొంత సమయం అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం, ఎన్నికల సంఘం తరఫు న్యాయవాదులు రెండు వారాల సమయం కోరడంతో, హైకోర్టు అంగీకరిస్తూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఆ లోగా ఎన్నికల తేదీలపై ఒక స్పష్టమైన నిర్ణయంతో రావాలని నిర్దేశించింది.




## భారతదేశ పురోగతికి నదులే రహదారులు

### –ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారతదేశ నదులు కేవలం వారసత్వ చిహ్నాలు మాత్రమే కావని, అవి దేశ ప్రగతికి కొత్త రహదారులుగా మారాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. గత కొన్నేళ్లుగా దేశంలో జలమార్గాలను అభివృద్ధి చేయడం ద్వారా రవాణా, పర్యాటక రంగాలు బలోపేతం అయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్ రాసిన ఒక ప్రత్యేక కథనాన్ని ప్రధాని శుక్రవారం తన 'ఎక్స్' సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. "వికసిత్ భారత్ నిర్మాణం దిశగా పునరుజ్జీవం పొందిన మన జలమార్గాలు ఎలా పయనిస్తున్నాయో" వివరిస్తూ సోనోవాల్ ఈ వ్యాసాన్ని రాశారు. ఒకప్పుడు మన దేశంలో నదులే ప్రధాన రవాణా మార్గాలుగా ఉండేవని, రోడ్లపై ట్రక్కుల హవా పెరగకముందే పట్నా, దిబ్రూగఢ్ వంటి ప్రాంతాల నుంచి కోల్‌కతాకు సరుకులు నదుల మీదుగానే చేరేవని సోనోవాల్ గుర్తుచేశారు. "భారత నదులే మన తొలి హైవేలు. కాలక్రమేణా రైలు, రోడ్డు మార్గాలు రావడంతో వాటి ప్రాధాన్యం తగ్గింది" అని ఆయన తెలిపారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం, భారత అంతర్గత జలమార్గాల ప్రాధికార సంస్థ (ఐడబ్ల్యూఏఐ) కృషితో ఇప్పుడు నదులకు మళ్లీ పూర్వ వైభవం వస్తోందని సోనోవాల్ వివరించారు. 2014 వరకు దేశంలో కేవలం 5 జాతీయ జలమార్గాలు మాత్రమే ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 111కి పెరిగిందని, వీటిలో 32 ఇప్పటికే కార్యకలాపాలు సాగిస్తున్నాయని ఆయన వెల్లడించారు. ఈ మార్పు వల్ల తక్కువ ఇంధన వినియోగం,

మిగతా 2లో



## నేడు తెలంగాణలో బీసీ సంఘాల బంద్

### –42శాతం రిజర్వేషన్ల డిమాండ్

### –ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ సీఎస్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గంలో త్వరలో జరగనున్న ఉప ఎన్నిక దృష్ట్యా అధికార యంత్రాంగం కీలక ఏర్పాట్లు చేస్తోంది. మరోవైపు.. రాష్ట్రవ్యాప్తంగా బీసీ రిజర్వేషన్ల అంశంపై నిరసనలు జరుగుతున్నాయి. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్ నవంబర్ 11వ తేదీన జరగనుంది. ఈ సందర్భంగా ఆ నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలకు సెలవు ప్రకటిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ

మిగతా 2లో

## మైనింగ్ లీజుల్లో వడ్డెర్లకు 15 శాతం రిజర్వేషన్లు



-సీనరేజి, ప్రీమియంలో 50 శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయం

-రాష్ట్ర ఖనిజ సంపదపై పూర్తిస్థాయి అధ్యయనానికి సీఎం ఆదేశం

-గనుల తవ్వకాలపై శాటిలైట్, డ్రోన్లతో పటిష్ఠ నిఘా

-పెండింగ్‌లో ఉన్న 6,500 మైనింగ్ దరఖాస్తులకు గ్రీన్ సిగ్నల్



## ఖరీఫ్ రైతులకు ఏపీ సర్కార్ గుడ్ న్యూస్

### –27 నుంచి కొనుగోళ్లు మొదలు

## వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి భారీ ఊరట

### –ఏసీబీ కోర్టు కీలక ఉత్తర్వులు



2లో

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు


### –తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి కీలక సూచనలు




2లో

## 78 యంగ్ ఇండియా స్కూళ్లకు ఆమోదం

### -రూ.15,600 కోట్లతో నిర్మించేందుకు నిర్ణయం



PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
శనివారం 18 అక్టోబర్2025

# మైనింగ్ లీజుల్లో వడ్డెర్లకు 15 శాతం రిజర్వేషన్లు

అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో వడ్డెర సామాజిక వర్గానికి ఆర్థికంగా చేయూతనిచ్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. మైనింగ్ లీజుల కేటాయింపులో వారికి 15 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అవసరమైన విధానాన్ని తక్షణమే రూపొందించాలని గనుల శాఖ అధికారులను ఆదేశించారు. సీనరేజి, ప్రీమియం వంటి చెల్లింపుల్లో వారికి 50 శాతం రాయితీ ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ అంశంపై పూర్తి ప్రతిపాదనలు సిద్ధం చేసి, తదుపరి కేబినెట్ సమావేశంలో చర్చకు తీసుకురావాలని సూచించారు. శుక్రవారం సచివాలయంలో గనులు, భూగర్భ వనరుల శాఖ, ఉచిత ఇసుక విధానంపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వడ్డెర్లకు లీజులు కేటాయించడమే కాకుండా, వారిని ఎంఎస్ఎంఈలుగా ప్రోత్సహించేలా ప్రస్తుత పాలసీలతో అనుసంధానం చేయాలని దిశానిర్దేశం చేశారు. వెనుకబడిన వర్గాలైన వడ్డెర్లకు ఆర్థిక ప్రయోజనాలు కలిగేలా లీజు కేటాయింపు విధానాన్ని రూపొందించాలని సీఎం స్పష్టం చేశారు. మైనింగ్ లీజుల కేటాయింపుతో పాటు వారు ఎంఎస్ఎంఈలుగా ఎదిగేందుకు కూడా ప్రస్తుతం ఉన్న పాలసీని అనుసంధానించాలని అన్నారు.

**ఉచిత ఇసుకతో ప్రజలకే ప్రయోజనం దక్కాలి**

ఇక, ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానం ద్వారా ప్రజలందరికీ ప్రయోజనం కలగాలని సీఎం స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా ఉచిత ఇసుక సరఫరాను సమర్థవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వ్యవస్థలో ఉన్న లోపాలను వినియోగించుకుని దుర్వినియోగం చేసే అవకాశం లేకుండా నిబంధనలు కఠినంగా అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఈ సీజన్ కోసం 66.5 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను నిల్వ చేశామని ప్రస్తుతం అన్ని స్టాక్ పాయింట్లలోనూ 43 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై సీఎం స్పందిస్తూ చిట్టచివరి వ్యక్తికీ ప్రయోజనం దక్కేలా ఇసుక లభ్యత జరగాలని అన్నారు. ఇసుక లోడింగ్ తో పాటు రవాణాకు అతితక్కువ వ్యయం అయ్యేలా చూడాలని సీఎం సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ఇసుక లభ్యతపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లోని అన్ని రూట్లలో పెట్టిన సీసీ కెమెరాల నిఘాను మరింత పటిష్టం చేయాలని సీఎం సూచించారు. ఆర్టీజీఎస్ ద్వారా ఉచిత పంపిణీ విధానంపై పర్యవేక్షించాలని సీఎం అన్నారు.

**విలువ జోడింపుతోనే అదనపు ఆదాయం**

రాష్ట్రంలో లభ్యం అవుతున్న ఖనిజాల విలువపై సమగ్ర అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు గనుల శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఖనిజాలకు విలువ జోడింపుతోనే అదనపు ఆదాయం వస్తుందని సీఎం సూచించారు. మేజర్, మైనర్ మినరల్స్ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.3320 కోట్ల ఆదాయార్జనను లక్ష్యంగా పెట్టుకున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గతంతో పోలిస్తే 34 శాతం మేర అదనంగా గనుల శాఖ నుంచి ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. మాంగనీస్ లాంటి మేజర్ ఖనిజాల ఉత్పత్తిలో 72 శాతానికి పైగా ఆదాయం వస్తోందని వివరించారు.దీనిపై స్పందించిన సీఎం ఏపీలో ఉన్న మినరల్ వెల్త్ విలువను అంచనా వేయాలని సూచించారు. ఒడిశా లాంటి రాష్ట్రాల్లో వాల్యూ ఎడిషన్ ద్వారా ఎక్కువగా ఆదాయాన్ని పొందుతున్నారని రూ.50 వేల కోట్ల ఆదాయం ఖనిజాల నుంచే వస్తోందని సీఎం తెలిపారు. ఏపీలోనూ అందుకు తగిన విజన్ ప్లాన్ తయారు చేసి విలువ జోడిస్తే రూ.20-30 వేల కోట్ల ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు. పెండింగ్ లో ఉన్న 6500 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు.రాష్ట్రంలో గనుల తవ్వకాలకు సంబంధించి శాటిలైట్ చిత్రాలు, డ్రోన్ ఆధారిత టెక్నాలజీతో విశ్లేషించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇచ్చిన పర్మిట్లు, జరిగిన తవ్వకాలు ఎంత అనేది ఎప్పటికప్పుడు విశ్లేషించాలన్నారు. అనలటిక్స్ ను వినియోగించుకుని జరిగిన తవ్వకాలను అంచనా వేయాలన్నారు. బీచ్ శాండ్ మినరల్స్ లాంటి భార ఖనిజాల మైనింగ్ తో పాటు విలువ జోడింపు ద్వారా అధిక ఆదాయం సాధించేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. అలాగే కడపలో నిర్మించనున్న స్టీల్ ప్లాంట్ కు ముడి ఇనుము ఖనిజం సరఫరా పై కూడా అధ్యయనం చేయాలని సూచించారు. ఈ సమీక్షకు గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఆ శాఖ ఉన్నతాధికారులు ముఖేష్ కుమార్ మీనా, ప్రవీణ్ కుమార్, ఆర్టీజీఎస్ అధికారులు హాజరయ్యారు.

# పార్టీ కోసం ఆస్తులు అమ్మినా, అయినా మోసం చేసింది

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మంత్రి పదవి దక్కకపోవడంతో కొంతకాలంగా అసంతృప్తితో ఉన్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇటీవల పార్టీపై, ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా ఘాటు విమర్శలు చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి విషయంలో కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీని కాపాడేందుకు తన ఆస్తులు అమ్ముకున్నానని కానీ పార్టీ తనను మోసం చేసిందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నుంచి వచ్చిన నలుగురికి మంత్రి పదవులు ఇచ్చారని చివరికి తనతోపాటు బీజేపీ నుంచి వచ్చిన వివేక్ వెంకటస్వామికి కూడా మంత్రి పదవి దక్కిందని అన్నారు. తనను మాత్రం పక్కన పెట్టారంటూ అసహనం వ్యక్తం చేశారు.

**ఆ నలుగురుకి ఇచ్చి నన్ను పక్కనపెట్టారు**

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో కాపాడేందుకు ఆస్తులు అమ్మినట్లు చెప్పుకొచ్చారు. అయితే పార్టీ తనను మోసం చేసిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికి మంత్రి పదవులు ఇచ్చారని చెప్పుకొచ్చారు. తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరి మంత్రి పదవులు తెచ్చుకున్నారని అలాగే బీజేపీ నుంచి తనతోపాటే పార్టీలోకి వచ్చిన వివేక్ వెంకటస్వామికి సైతం మంత్రి పదవి ఇచ్చారని చెప్పుకొచ్చారు. తనను మాత్రం పక్కన పెట్టారంటూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్రవ్యాఖ్యలు చేశారు.

**జానారెడ్డి అడ్డుకోవడం బాధగా ఉంది**

మంత్రి పదవి ఇస్తామని స్పష్టమైన హామీ ఇచ్చి, ఇప్పుడు మాట తప్పారంటూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మండిపడ్డారు.

కాంగ్రెస్‌లోని కొందరు నాయకులే తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకుంటున్నారంటూ ధ్వజమెత్తారు. మంత్రి పదవి ఇస్తానని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, కానీ నా మంత్రి పదవి విషయంలో కొందరు రాజకీయాలు చేస్తున్నారని తెలిపారు. గతంలో మాజీమంత్రి జానారెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. మహాభారతంలో ధర్మరాజులాగా వ్యవహరించాల్సిన జానారెడ్డి వంటి వారు ప్రస్తుతం ధృతరాష్ట్రుడి పాత్ర పోషిస్తున్నారంటూ మండిపడ్డారు.నా మంత్రి పదవి విషయంలో జానారెడ్డి అడ్డుతగలడం చూసి చాలా బాధగా ఉందన్నారు. పార్టీ కోసం ఎంతో త్యాగం చేసిన తనకు అన్యాయం జరిగిందంటూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

**ఓపికతో ఎదురుచూస్తున్నా**

ఎన్నికల సమయంలో మంత్రి పదవి ఇస్తామని మాటిచ్చారు. ఇచ్చినప్పుడు ఇవ్వండి అని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇద్దరం అన్నదమ్ములం ఉన్నామని పార్టీలోకి తీసుకున్నప్పుడు తెలియదా? అని నిలదీశారు. లోక్‌సభ ఎన్నికల్లో రెండోసారి హామీ ఇచ్చినప్పుడు తెలియదా? అని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రశ్నించారు. 9 మంది ఎమ్మెల్యేలున్న ఖమ్మం జిల్లాకు 3 మంత్రి పదవులు ఇచ్చారు. 11 మంది గెలిచిన నల్గొండ జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉంటే తప్పా? అన్నదమ్ముల్లో ఇద్దరం సమర్థులమే. ఇద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పేంటి? ఆలస్యమైనా సరే ఓపిక పడుతున్నా? అంటూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు.

# నేడు తెలంగాణలో బీసీ సంఘాల బంద్

కొనసాగుతోంది. షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 21 వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు తీసుకుంటారు. 22న నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నారు. 24 వరకు ఉపసంహరణకు గడువు ఉంది. నవంబర్ 11న పోలింగ్ నిర్వహించి, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు జరపనున్నారు. సెలవు రోజులు మినహా మిగిలిన పనిదినాల్లో నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. అభ్యర్థులు కార్యాలయంలో నేరుగా లేదా డిజిటల్ పద్ధతిలో కూడా నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు.

**అక్టోబర్ 18వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా బంద్**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ సంఘం అక్టోబర్ 18వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చింది. స్కూల్స్, కాలేజీలతో పాటు పెట్రోల్ బంక్‌లు కూడా బంద్ పాటించనున్నాయి. నేడు ఒక్క మెడికల్ షాపులు మినహా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని షాపులు మూసివేయనున్నారు. ఈ నేపథ్యంలో డీజీపీ శివధర్‌రెడ్డి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా బంద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. నిఘా బృందాలు, పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలని ఆదేశించారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీజీపీ హెచ్చరించారు. తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు జారీ చేసిన జీవోపై హైకోర్టు అక్టోబర్ 9న స్టే విధించింది. దీనికి వ్యతిరేకంగా బీసీ సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. బీసీలు ఇప్పటికీ సామాజిక వివక్షకు గురవుతున్నారని, వారికి సమాన హక్కులు, గౌరవం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. కోర్టులు బీసీలకు అన్యాయం చేస్తున్నాయని ఆరోపిస్తూ, 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని పట్టుబడుతున్నారు. రాహుల్ గాంధీ హామీ మేరకు సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కుల గణన సర్వే నిర్వహించామని కాంగ్రెస్ పేర్కొంది. బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ (బీసీ జేఏసీ) ఈ బంద్‌ను నిర్వహిస్తోంది. జేఏసీ చైర్మన్, బీజేపీ రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో ఈ ఆందోళన జరుగుతోంది. ప్రజలు శాంతియుతంగా పాల్గొనాలని, దుకాణాలు, వ్యాపార సంస్థలు మూసివేయాలని కోరారు. ఆర్టీసీ బస్సులు నడపకూడదని పిలుపునిచ్చారు.

**అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ**

ఈ బంద్‌కు రాజకీయ పార్టీలు, ఎస్సీ, ఎస్టీ బీసీ సంఘాల నుంచి సంపూర్ణ మద్దతు లభించింది. బషీర్‌బాగ్ నుంచి లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మందకృష్ణ మాదిగ, జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ కోదండరాం, అద్దంకి దయాకర్ వంటి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# 78 యంగ్ ఇండియా స్కూళ్లకు ఆమోదం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య వ్యవస్థలో సమూల మార్పుల చేసేందుకు రెడీ అయ్యింది. ఇందుకోసం పలు కీలక సంస్కరణలు అమలు చేస్తోంది. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి మెరుగైన, నాణ్యమైన విద్యను అందించేందుకు సిద్ధమయిన ప్రభుత్వం, ఆ దిశగా అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా తాజాగా తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున మొత్తం 78 యంగ్ ఇండియా గురుకులాలు ఏర్పాటు చ్తేసేందుకు నిర్ణయం తీసుకుంది. తెలంగాణ సర్కార్ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 78 చోట్ల యంగ్ ఇండియా గురుకుల కాంప్లెక్సులు నిర్మించాలని నిర్ణయించుకుంది. దీనిలో భాగంగా ఒక్కో కాంప్లెక్సుకు రూ.200 కోట్లు చొప్పున మొత్తం రూ.15,600 కోట్లు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమయ్యింది. ఈ ప్రతిపాదనలకు తాజాగా తెలంగాణ మంత్రిమండలి ఆమోదం తెలిపింది. దీంతో పాటు గురువారం నాటి కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

తెలంగాణ ప్రభుత్వ యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దీని కోసం భారీ స్థాయిలో నిధులు ఖర్చు చేసేందుకు సిద్ధం అవుతోంది. దీనిలో భాగంగానే 78 యంగ్ ఇండియా గురుకులాల్లో ఒక్కో కాంప్లెక్సుకు రూ.200 కోట్ల చొప్పున మొత్తం రూ.15,600 కోట్లు కేటాయించనుంది. ఆర్థికశాఖ ఇప్పటికే యంగ్ ఇండియా గురకుల కాంప్లెక్స్ నిర్మాణాలకు అవసరమైన పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేసింది. విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ఈ ప్రతిపాదనలను డిప్యూటీ సీఎం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమర్పించారు. గురువారం నాటి కేబినెట్ భేటీలో దీన్ని ఆమోదించారు.

**వెయ్యి పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు**

ఇదిలా ఉండగా వచ్చే విద్యాసంవత్సరం నుంచి అనగా 2025-26 విద్యా సంవత్సరం నాటికి 100 పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించాలనే నిర్ణయానికి కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది. పోయిన సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా 250 పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించగా ఈ విద్యా సంవత్సరంలో మరో 210 పాఠశాలలకు విస్తరించారు. దీంతో ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పూర్వ ప్రాథమిక పాఠశాలల సంఖ్య 460కి చేరుకుంది. వీటికి అదనంగా పీఎంశ్రీ కింద మరో 112 పాఠశాలలు కూడా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించడానికి ఆసక్తి చూపుతున్నారు.ఈ నిర్ణయం వల్ల విద్యార్థుల బాల్యదశ విద్యకు బలమైన పునాదులు పడతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పాఠశాలల వల్ల ప్రస్తుతం రాష్ట్రంలో పూర్వ ప్రాథమిక, ప్రాథమిక తరగతుల్లో విద్యార్థుల హాజరు శాతం గణనీయంగా పెరిగిందంటున్నారు అధికారులు. అందుకే ప్రభుత్వం మరిన్ని పాఠశాలల్లో వీటిని ప్రారంభించేందుకు ఆసక్తి చూపుతుంది.

# ఆహారంలో వెంట్రుకలు- ప్రయాణికుడికి రూ.35వేలు పరిహారం చెల్లించండి'- ఎయిర్ ఇండియాకు హైకోర్టు ఆదేశం!

ఆహారంలో వెంట్రుకలు వచ్చినందుకు మద్రాస్ హైకోర్టు ఎయిర్ ఇండియాకు చీవాట్లు పెట్టింది. ఇది పూర్తిగా విమానయాన సంస్థ నిర్లక్ష్యం వల్లనే జరిగిందని వ్యాఖ్యానించింది. బాధిత ప్రయాణికుడికి రూ.35,000 పరిహారం చెల్లించాలని ఆదేశించింది.

శ్రీలంక రాజధాని కొలంబో నుంచి చెన్నైకు సుందర పరిపూర్ణం అనే ప్రయాణికుడు వస్తున్నారు. ఆ సమయంలో ఆయనకు ఎయిర్ ఇండియా స్టాఫ్ భోజనం వడ్డించారు. ఆయన సగం భోజనం పూర్తి చేసిన తరువాత అందులో వెంట్రుకలు చూసి షాక్ అయ్యారు. వెంటనే ఆయన దీనిపై విమాన సిబ్బందికి ఫిర్యాదు చేశారు. ఆ తరువాత సదరు కలుషిత ఆహారం వల్ల ఆయన అనారోగ్యం పాలయ్యారు. దీనితో ఆయన తనకు ఇవ్వబడిన కలుషితి ఆహారం గురించి చెన్నై విమానాశ్రయ అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనితో సుందర పరిపూర్ణం చెన్నై అదనపు సివిల్ కోర్టులో కేసు దాఖలు చేశారు. దీనితో న్యాయస్థానం బాధిత ప్రయాణికుడికి రూ.1 లక్ష చెల్లించాలని ఎయిర్ ఇండియాను ఆదేశించింది.

మద్రాస్ హైకోర్టును ఆశ్రయించిన ఎయిర్ ఇండియా అయితే చెన్నై అదనపు సివిల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ ఎయిర్ ఇండియా మద్రాస్ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది. దీనిపై ఇవాళ (శుక్రవారం) జస్టిస్ బాలాజీ విచారణ జరిపారు. వాద, ప్రతివాదనల సందర్భంగా, సదరు ప్రయాణికుడికి వడ్డించిన ఆహారంలో వెంట్రుకలు ఉన్నట్లు ఎయిర్ ఇండియా అంగీకరించింది. అయితే ఇందులో తమ తప్పు ఏమీ లేదని పేర్కొంది."మా ఎయిర్ ఇండియా విమానంలో వడ్డించిన ఆహారం అపరిశుభ్రంగా ఉంది. అందుకు మేము విచారిస్తున్నాం. అయితే మా విమానంలో వడ్డించే ఆహారాన్ని చెన్నైలోని అంబాసిడర్ పల్లవ హోటల్ తయారు చేస్తుంది. కనుక ఆ హోటల్‌ను కూడా ఈ కేసులో చేర్చాలి. ఎందుకంటే అపరిశుభ్రమైన ఆహారానికి అదే బాధ్యత వహించాల్సి ఉంటుంది. కేవలం ఎయిర్ ఇండియా మాత్రమే దీనికి బాధ్యత వహించదు." అని ఎయిర్ ఇండియా తరఫు న్యాయవాదులు వాదించారు.

అయితే ఎయిర్ ఇండియా వాదనలను మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బాలాజీ తిరస్కరించారు. ఎయిర్ ఇండియా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, తప్పును హోటల్‌పై నెట్టడానికి ప్రయత్నించిందని అన్నారు. అందుకే బాధిత ప్రయాణికుడికి పరిహారం చెల్లించాలని స్పష్టం చేశారు. అయితే కింది కోర్టు విధించిన రూ.1 లక్ష రూపాయల పరిహారాన్ని తగ్గించి, రూ.35వేలు చెల్లించాలని ఆదేశించారు.

ఎయిర్ ఇండియాకు సంబంధించి, ఆహారంలో వెంట్రుకలు రావడం ఇదే మొదటిసారి కాదు. 2016 సెప్టెంబర్‌లో ముంబయి-న్యూయార్క్ విమానంలో వెళ్తున్న ప్రయాణికురాలికి పాసిపోయిన ఆహారాన్ని వడ్డించారు. పైగా దానిలో వెంట్రుకలు కూడా కనిపించాయి. దీనితో ఆమె జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ)కి ఫిర్యాదు చేసింది. దీనితో కమిషన్ కీలక ఆదేశాలు జారీ చేసింది. '

## భారతదేశ పురోగతికి నదులే రహదారులు

తక్కువ కాలుష్యం, చౌకైన రవాణా వంటి ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు. జలమార్గాల ద్వారా సరకు రవాణాలో అద్భుతమైన పురోగతి కనిపిస్తోందని గణాంకాలతో సహా వివరించారు. 2013-14లో కేవలం 18 మిలియన్ టన్నులుగా ఉన్న సరకు రవాణా, 2024-25 నాటికి 145 మిలియన్ టన్నులకు పెరిగిందని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో 2030 నాటికి 200 మిలియన్ టన్నులు, 2047 నాటికి 250 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుందని తెలిపారు. అదే సమయంలో నదీ పర్యాటకం (రివర్ టూరిజం) కూడా వేగంగా అభివృద్ధి చెందుతోందని సోనోవాల్ అన్నారు. దశాబ్దం క్రితం కేవలం 5 క్రూయిజ్ నౌకలు మాత్రమే ఉండగా, ప్రస్తుతం 13 జలమార్గాల్లో 25 క్రూయిజ్ నౌకలు సేవలందిస్తున్నాయని చెప్పారు. గంగా, బ్రహ్మపుత్ర, కేరళ బ్యాక్‌వాటర్స్ ఈ రంగంలో ముందున్నాయని, వారణాసి, కోల్‌కతా, పాట్నా, గౌహతి వంటి టెర్మినళ్లను ఆధునికీకరిస్తున్నామని ఆయన తన వ్యాసంలో పేర్కొన్నారు.

## వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి భారీ ఊరట

అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీలో వైసీపీ ఎంపీ పీవీ మిథున్ రెడ్డికి ఊరట లభించింది. మద్యం స్కాంలో నిందితుడిగా ఉంటూ ప్రస్తుతం బెయిల్ పై ఉన్న ఆయన చేసిన ఓ కీలక విజ్ఞప్తికి విజయవాడ ఏసీబీ కోర్టు అంగీకరించింది. అయితే కొన్ని షరతులు పెట్టింది. సీఐడీ వ్యతిరేకించినా మిథున్ రెడ్డి పిటిషన్ పై విచారణ జరిపిన ఏసీబీ కోర్టు కీలక ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో వైసీపీ ఎంపీ ఊపిరిపీల్చుకున్నారు. ఈ నెల 23 నుంచి నవంబర్ 4 వరకూ విదేశీ పర్యటనకు వెళ్లేందుకు అనుమతి కావాలంటూ వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి విజయవాడ ఏసీబీ కోర్టులో గతంలో పిటిషన్ దాఖలు చేశారు. అయితే మద్యం కేసులో నిందితుడిగా ఉన్న ఆయనకు గతంలో ఇచ్చిన బెయిల్ పైనే అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న సీఐడీ సిట్ విభాగం ఈ విజ్ఞప్తినీ ఒప్పుకోలేదు. అయితే కోర్టు మాత్రం మిథున్ రెడ్డి చేసిన వాదనతో ఏకీభవిస్తూ షరతులతో అనుమతి ఇచ్చింది.

మిథున్ రెడ్డి విదేశీ పర్యటనకు అనుమతించిన ఏసీబీ కోర్టు కొన్ని షరతులు పెట్టింది ఇందులో రూ.50 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. అలాగే విదేశీ పర్యటన తర్వాత తన పాస్‌పోర్టు కోర్టుకు అప్పగించాలని మిథున్‌రెడ్డిని ఆదేశించింది. దీంతో పాటు విదేశాల్లో ఎక్కడికి వెళ్తారో, ఎక్కడ ఉంటారో వివరాలు ఇవ్వాలని కూడా కోరింది. ఏపీ మద్యం కేసులో ఏ4గా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ఈ షరతులకు అంగీరిస్తూ అఫిడవిట్ దాఖలు చేసి అనుమతి తీసుకోనున్నారు. వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో మిథున్ రెడ్డి పాత్రపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో ఆయన సుప్రీంకోర్టు వరకూ వెళ్లినా అరెస్టు నుంచి తప్పించుకోలేకపోయారు. దీంతో ఆయన గతంలో కోర్టు ఆదేశాల మేరకు లొంగిపోవడంతో రాజమండ్రి జైలుకు రిమాండ్ పై పంపారు. అక్కడ కొంతకాలం ఉన్నాక బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవడంతో ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆ తర్వాత ఆయనకు రెగ్యులర్ బెయిల్ కూడా లభించింది.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసి తీరాల్సిందేనని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాలు నేడు (అక్టోబర్ 18) రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ బంద్‌కు ప్రధాన రాజకీయ పార్టీలన్నీ మద్దతు ప్రకటించాయి. అయితే తెలంగాణ బంద్ నేపథ్యంలో రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. నేడు వివిధ పార్టీలు తలపెట్టిన బంద్ కార్యక్రమాన్ని శాంతియుతంగా జరుపుకోవాలని స్పష్టం చేశారు. బంద్ పేరుతో అవాంఛనీయ సంఘటనలకు గానీ, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు గానీ పాల్పడినట్లయితే చట్టం ప్రకారం కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. నేడు చేపడుతున్న బంద్‌కు సంబంధించిన పరిస్థితులను పోలీస్ సిబ్బంది, నిఘా బృందాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాయని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. బంద్ సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. సాధారణ ప్రజలకు సమస్యలు ఎదురవకుండా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డీజీపీ స్పష్టం చేశారు.

## ఖరీఫ్ రైతులకు ఏపీ సర్కార్ గుడ్ న్యూస్

అమరావతి (ప్రశ్న న్యూస్)ఏపీలో ఖరీఫ్ రైతులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ సీజన్ లో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కీలక ప్రకటన చేశారు. ఈ నెల 27 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల్ని తెరుస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అప్పటి నుంచే కొనుగోళ్లు ప్రారంభం అవుతాయన్నారు. ఈసారి ఖరీఫ్ సీజన్ లో 51 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి వెల్లడించారు. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న ఆయన ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్న అందర్నీ కలుపుకొని పనిచేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం చేసిన 1674 కోట్ల రూపాయల బకాయిలను తీర్చడంలోనూ, ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ మిల్లర్లకు చెల్లించవలసిన 763 కోట్ల రూపాయలు చెల్లించడం ద్వారా కూటమి ప్రభుత్వం చాలా పారదర్శకంగా పనిచేస్తుందన్నారు.

బ్యాంక్ గ్యారంటీలు 1:2 ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకు గాను 35 బ్యాంకు సేవలను ఉపయోగించుకోవచ్చని తెలిపారు. కొన్ని జిల్లాలలో రైస్ మిల్లుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని రియల్ టైం గవర్నెన్స్ చేసి చూపిస్తామన్నారు. సంస్కరణలలో భాగంగా వాట్సాప్ ద్వారా రిజిస్ట్రేషన్: "హాయ్" అని పంపగానే కొనుగోలు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల నుంచి 48 గంటల్లోనే ప్రభుత్వం రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు. రేషన్ బియ్యం స్మగ్లింగ్ అరికట్టడంలో రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి తోడుగా నిలవాలని ఆయన కోరారు. రైతు కోసం కలిసి పనిచేద్దాం, వ్యవస్థను గౌరవిద్దామన్నారు. గత సంవత్సరం అనుభవంతో, తేమ శాతం కొలిచే యంత్రాలు, రవాణా సదుపాయాలు, క్వాలిటీ గన్నీ బ్యాగులు ముందుగానే సిద్ధం చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. సమస్య పరిష్కారానికి ఎప్పుడు సిద్ధంగా ఉండాలని, పని చేసే విధానం పారదర్శకంగా ఉండాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సీజన్‌లో 3013 రైతు సేవా కేంద్రాలు, 2061 పీపీసీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మొత్తం 10,700 సిబ్బందితో ధాన్యం సేకరణకు సిద్ధమవుతున్నట్టు మంత్రి తెలిపారు.

## హైదరాబాద్‌లోని పలు ఫారెక్స్ సంస్థల్లో ఈడీ తనిఖీలు

లేకుండా, బోగస్ పత్రాలతో ఈ సంస్థలు నిర్వహిస్తున్నట్లు సోదాల్లో తేలింది. కొన్ని ఫారెక్స్ సంస్థలు అక్రమంగా డబ్బు మార్పిడి వ్యాపారం చేస్తున్నట్లు ఈడీ దర్యాప్తులో వెల్లడైంది. పలు సంస్థలు ఫెమా నిబంధనలను ఉల్లంఘించినట్లు ఈడీ పేర్కొంది. ఈ దాడుల్లో నకిలీ పత్రాలు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్‌లతో పాటు రూ. 11.99 లక్షల నగదు, రూ. 26.77 లక్షల విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ అధికారులు తెలిపారు.

## తెరుచుకున్న శబరిమల అయ్యప్ప ఆలయం- ద్వారపాలక విగ్రహాలకు తిరిగి బంగారు తాపడం ఆలయ పూజారులు, అధికారుల సమక్షంలో ప్రతిష్ఠ

కేరళలోని శబరిమల అయ్యప్పస్వామి దేవాలయంలోని ద్వారపాలక విగ్రహాలపై పూత పూసిన బంగారు-రాగి తాపడాలను తిరిగి ప్రతిష్ఠించారు. తులం మాసం సందర్భంగా ఆలయాన్ని ప్రారంభించిన క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సుమారు 14 బంగారు-రాగి తాపడాలను కేరళ హైకోర్టు ఆదేశాల మేరకు తీసుకువచ్చినట్లు తెలిపారు. చెన్నైలోని స్మార్ట్ క్రియేషన్స్ సంస్థ నుంచి తిరిగి తీసుకువచ్చి ఆలయ పూజారులు, అధికారుల సమక్షంలో ప్రతిష్ఠించారు. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి దాదాపు గంట సమయం పట్టిందని అధికారులు తెలిపారు. బంగారు తాపడాలను రాతితో తయారైన విగ్రహాలపై మేకులతో బిగించినట్లు వివరించారు.

మరోవైపు తులం మాస పూజల కోసం శబరిమల అయ్యప్ప ఆలయాన్ని శుక్రవారం సాయంత్రం 5 గంటలకు తెరిచారు. అక్టోబర్ 17- 22 వరకు ఐదు రోజుల పాటు తెరవనున్నట్లు ట్రావెన్ కోర్ దేవస్వమ్ బోర్డు (టీడీబీ) ప్రకటించింది. ఉదయాస్తమాన పూజ, పడిపూజ, కలశాభిషేకం, పుష్పాభిషేకం వంటి ఐదు రోజుల ప్రత్యేక ఆచారాల తర్వాత అక్టోబర్ 22న రాత్రి 10 గంటలకు మూసివేస్తామని వివరించింది. ఇప్పటికే దాదాపు 30,000 మంది భక్తులు అయ్యప్ప దర్శనానికి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అక్టోబర్ 22న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సైతం ఆలయాన్ని సందర్శించనున్నారు.అంతకుముందు ఈ బంగారం చోరీ కేసులో ప్రధాన నిందితుడు బెంగళూరు వ్యాపార వేత్త ఉన్నికృష్ణన్ పొట్టిని కేరళ హైకోర్టు ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం అరెస్టు చేసింది. గురువారం తిరువనంతపురంలోని క్రైమ్‌బ్రాంచ్ ఆఫీసులో ఉన్నికృష్ణన్ పొట్టీని విచారించిన సిట్, శుక్రవారం పులిమత్‌లోని ఆయన నివాసం నుంచి కస్టడీలోకి తీసుకుంది. తర్వాత పొట్టీని ఆస్పత్రికి తరలించిన సిట్ అధికారులు వైద్యపరీక్షలు నిర్వహించారు.

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
శనివారం18 అక్టోబర్2025

# జామాయిల్ ప్లాంటేషన్ లో చీకటి దందా..!!

**- అర్ధరాత్రి గొడ్డలి వేటుకు ఆవిరవుతున్న జామాయిల్ ప్లాంటేషన్.**

**- ఇంటి దొంగలే.? జామాయిల్ ప్లాంటేషన్ దొంగలా.??**

**- అధికారులపై ఎన్నో అనుమానాలకు తావిస్తున్న కలప రవాణా..**









జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) అక్టోబర్ 17 : కంచె చేనును మేసింది అనే సామెతకు అనుగుణంగానే. అటవీ శాఖ అధికారుల కను సన్నల్లోనే ఈ కలప స్మగ్లింగ్ జరుగుతుందా.? ప్లాంటేషన్ లో ఏపుగా జమాయిల్ చెట్లు పెరుగుతున్నాయని తెలిసినప్పటికీ అటవీ అధికారులు ఎందుకు ప్రత్యేక దృష్టి సారించలేకపోయారు. ఎంతో అవసరమున్న జామాయిల్ కర్రను కొందరు స్మగ్లింగ్ చేస్తున్నారు. ఈ విషయం గురించి చుట్టుపక్కల గ్రామస్తులు బహిరంగాను చర్చించుకుంటున్నా. అటవీ సంపదను కాపాడాల్సిన అటవీ అధికారుల వరకు ఈ ముచ్చట పోలేదంటే ఎవరైనా నమ్ముతారా? పర్యావరణాన్ని కాపాడండి అంటూ ప్రభుత్వాలు కొన్ని కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తూ మొక్కలు నాటిస్తుంటే కలప స్మగర్లు అటవీ సంపదను నాశనం చేస్తున్నారు. అర్ధరాత్రుళ్ళో అక్రమంగా అటవీలోకి ప్రవేశిస్తూ చెట్లను నరికేస్తున్నారు. మొన్నటివరకు పచ్చగా విరాజిల్లిన ఈ ప్రాంతంలో చెట్లు మోడు బారిపోతున్నాయి. అర్ధరాత్రుల్లో కంటికి కనిపించకుండా కలపను తరలిస్తున్న మాఫియా వెనక కొందరు ఫారెస్ట్ అధికారులే ఉన్నారని ప్రజలు చర్చించు కుంటున్నారు.

**– అర్ధరాత్రి గొడ్డలి వేటుకు ఆవిరవుతున్న ప్లాంటేషన్..!**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధిలోని గుండెపుడి. బీట్ లోని జామాయిల్ ప్లాంటేషన్లో ఏపుగా పెరుగుతున్న జామాయిల్ చెట్లను కొందరు ఫారెస్ట్ అధికారుల సహకారంతో కలప స్మగ్లర్లు అర్ధరాత్రుల్లో చెట్లను నరికి రవాణా జరుపుతున్నట్టు చుట్టుపక్కల గ్రామాలలో చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం కొందరు వ్యక్తులు ట్రాక్టర్లతో జామాయిల్ కర్రను తీసుకువెళ్తుండగా గ్రామస్తులు గుర్తించారు. విషయం అందరికీ తెలియడంతో నరికిన జామాయిల్ కర్ర సుమారు (150) కర్రలను అనంతారం గ్రామంలోని ఓ రైతుకు చెందిన పామాయిల్ తోటలో దాచిపెట్టారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ రేంజ్ అధికారిని నాజర్బీ పామాయిల్ తోట వద్దకు వెళ్లి నరికిన కర్రను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం సదరు అధికారిని ప్లాంటేషన్ వద్దకు వెళ్లి నరికిన చెట్లను కొలిచి లెక్కించారు.

**– ఫారెస్ట్ శాఖ పర్యవేక్షణ లోపమే చెట్ల నరికివేత కారణమా.?**

జామాయిల్ ప్లాంటేషన్ లో ఈ తతంగం గత కొంతకాలంగా జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు కొందరు అధికారుల కనుసన్నలోనే జరుగుతున్నట్లు ఉన్నత అధికారులకు తెలిసినా తెలియనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్ధరాత్రుల్లో చెట్లను నరికి వే బ్రిడ్జిల వద్ద అమ్మకాలు జరుపుతున్నారని ఈ కర్రల వ్యాపారాన్ని నూతనంగా నిర్మిస్తున్న బిల్డింగ్ సపోర్టులకు అమ్ముకుంటున్నారని చర్చ జరుగుతోంది ఇప్పటికైనా జిల్లా అధికారులు కలప అక్రమ రవాణా విషయలో విచారణ జరిపి అధికారుల పాత్ర ఉందనే విషయంపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.

**అక్రమ కలప రవాణా విషయమై డిప్యూటీ రేంజ్ అధికారిణి నిజర్బీ ని వివరణ కోరగా**

కొందరు వ్యక్తులు గుండెపుడి బీట్లోని జామాయిల్ ప్లాంటేషన్లోని చెట్లను నరికి తీసుకువెళ్లి అనంతారం గ్రామంలో ఓరైతు కు చెందిన పామాయిల్ తోటలో దాచి పెట్టారనే విషయం గ్రామస్తులద్వారా సమాచారం తెలుకుని. పామాయిల్ తోటవద్దకు వెళ్లి దాచిన జామాయిల్ కర్రను గుర్తించి స్వాధీనం చేసుకున్నానని. కొందరు వ్యక్తులు అక్రమంగా జమాల్ చెట్లు నరికి ట్రాక్టర్లలో తరలిస్తున్నారనే సమాచారం మేరకు జమాయిల్ కర్రలను స్వాధీనం చేసుకున్నామని. ఇట్టి విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి విచారణ జరిపి బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## బీసీ జేపీసీ ఇచ్చిన రాష్ట్ర బంద్ కు సంపూర్ణ మద్దతు



నాచారం(ప్రశ్న న్యూస్)స్థానిక సంస్థల్లో,చట్ట సభల్లో, విద్య,ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలనీ బీసీ జేఏసీ ఇచ్చిన బందుకు తెలంగాణ విద్యార్థి సమైక్య రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని రాష్ట్ర అధ్యక్షుడు హరీష్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షం ఏర్పాటు చేసి తొమ్మిదవ షెడ్యూల్లో బిసి బిల్లు చేర్చే విధంగా, బీసీ బిల్లులకు చట్టబద్ధత కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేడు బీసీ జేఏసీ తలపెట్టిన బందుకు ప్రజలు, విద్య, వ్యాపార, వాణిజ్య సంస్థల యాజమాన్యాలు,వివిధ రంగాల సంస్థలు బందులో పాల్గొని సంపూర్ణ మద్దతు తెలియజేయాలని తెలంగాణ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పూదరి హరీష్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

## యాంటీ డ్రగ్స్ ఫోరం కన్వీనర్ గా మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి



నాచారం(ప్రశ్న న్యూస్)నాచారంలో జేఏసీల ఆధ్వర్యంలో మరో కొత్త జేఏసీ ఆవిర్భవించింది. యువత ను మత్తు పదార్థాల నుండి రక్షించాలని ఉద్దేశం తో యాంటీ డ్రగ్స్ ఫోరం ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు, కుల సంఘాల నాయకులు, సామాజిక సేవా సంస్థల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాంటీ డ్రగ్స్ ఫోరం జేఏసీ కన్వీనర్గా మామిడాల సంతోష్ రెడ్డి ని జేఏసీ నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంతోష్ రెడ్డి భారత నేవీలో పనిచేసిన అనుభవం కలిగినవారు. దేశ సేవలో ఆయనకు ఉన్న అనుభవం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు యువతను సరైన దిశలో నడిపించేందుకు దోహదపడతాయని అందరూ అభిప్రాయపడ్డారు.సమాజంలో మాదకద్రవ్యాల వాడకాన్ని నిర్మూలించి, యువతకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించడమే ఈ ఫోరమ్ ప్రధాన లక్ష్యం అని కన్వీనర్ సంతోష్ రెడ్డి తెలిపారు. నాచార పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమానికి శ్రీకారం చుడతామన్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై యువతకు అవగాహన కల్పిస్తామని సంతోష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల జేఏసీ కన్వీనర్ కరాటే శ్రీరామ్, ఇంటలిజెర్స్ ఫోరం కన్వీనర్ కనకమెడల రాంబాబు, ఆటో వ్యాన్ జేఏసీల కన్వీనర్ గడ్డం శ్రీనివాస్, భవన నిర్మాణ కార్మిక జేఏసీ కన్వీనర్ బొడ్డు శివ, అద్వై ఎంఆర్పిఎస్ రాష్ట్ర నాయకుడు కొరపాక అంజి, ఎస్ ఎస్ ఎస్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం..



తల్లాడ, అక్టోబర్ 17 (ప్రశ్నన్యూస్): మండల పరిధిలో అన్నారు గూడెం గ్రామంలో శుక్రవారం ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ నవభారత్ ఐ సెంటర్ వారి సౌజన్యంతో, తల్లాడ విజన్ టెక్నీషియన్ శ్రీమతి వినోద ఆధ్వర్యంలో, గ్రామస్థుల సహకారంతో ఉచిత కంటి పరీక్ష శిబిరం ఘనంగా నిర్వహించబడింది. ఈ శిబిరంలో గ్రామ ప్రజల నుండి 150 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించగా, 100 మందికి పైగా ఉచిత కంటి అద్దాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పెద్దలు, గ్రామస్థులు, మా గ్రామాన్ని ఎన్నుకొని సేవలందించిన ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్కి వారి డాక్టర్ల బృందానికి హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరంలో సేవలందించిన ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ బృంద సభ్యులు అడ్మినిస్ట్రేటర్ శ్రీ దేవి చంద్రరావు విజన్ సెంటర్ కోఆర్డినేటర్ శ్రీ సాయి తేజ విజన్ టెక్నీషియన్ శ్రీమతి రాయపాటి వినోద, శ్రీమతి స్నేహ, చైతన్య, విజయలక్ష్మి ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీమతి జ్యోతి సారిక, గ్రామస్థులకు సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు,గ్రామ పెద్దలు ఆ.పతి వెంకట రామారావు, ఎల్లంకి వెంకటేశ్వర్లు, చింతల నరేష్, గాదె కృష్ణారావు,పెరిక కిరణ్,తమ్మిశెట్టి కృష్ణ, గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు, తంబళ్ల రమేష్, పంచాయతీ సిబ్బంది, గ్రామ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

### నేడు నిర్వహిస్తున్న బీసీ బందు ను విజయవంతం చేయండి

### జెడ్పిటిసి సభ్యురాలు ముత్యం గారి మేఘమాల సంతోష్ కుమార్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వచ్చే స్థానిక ఎన్నికలలో బుద్ధి చెప్పాలని బీసీలను మోసం చేస్తున్న ఘనత కేవలం కాంగ్రెస్ పార్టీకి దక్కిందని కొల్చారం మండల మాజీ జెడ్పిటిసి సభ్యురాలు ముత్యం గారి మేఘమాల సంతోష్ కుమార్ అన్నారు భారతీయ రాష్ట్ర సమితి శనివారం నాడు నిర్వహించిన బందుకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలిపారని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మంత్రులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని ప్రతి దగ్గర బీసీలకు అన్యాయమే జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీయాలని స్థానిక ఎన్నికలలో బీసీలు అంతా కలిసి కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ఆయన అన్నారు మండల వ్యాప్తంగా ఉన్న టిఆర్ఎస్ నాయకులు మద్దతుగా ముందుకు వస్తున్నారని శనివారం నిర్వహిస్తున్న బీసీ బంద్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# రజక సంఘం పక్షాన మైలారం రాము సమన్వయంతో జగద్గురువుల ఘన స్వాగతానికి సిద్ధం



విప్ ఆది శ్రీనివాస్ కు సంసిద్ధతను వ్యక్తం

విప్ ఆది శ్రీనివాస్ తో కలిసి ఏర్పాట్లు పరిశీలన

వేములవాడ (ప్రశ్న న్యూస్)శృంగేరి జగద్గురు శ్రీశ్రీశ్రీ విధుర శేఖర భారతి స్వామి వారు ఈ నెల 19న (ఆదివారం) వేములవాడ పట్టణానికి విచ్చేస్తున్న నేపథ్యంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే సంకల్పంతో పట్టణంలోని అన్ని వర్గాల భక్తులు, సంఘాలు చురుకుగా ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి.

ప్రత్యేకంగా రజక సంఘం తెలంగాణ రాష్ట్ర పూర్వ కన్వీనర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మైలారం రాము విప్ ఆది శ్రీనివాస్ తో కలిసి శుక్రవారం స్వయంగా ముందుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. రజక వర్గం తరఫున భారీ సంఖ్యలో భక్తులు స్వామివారికి ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారని విప్ శ్రీనివాస్ కు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ "సాక్షాత్తు దైవ స్వరూపులైన శృంగేరి జగద్గురువులు వేములవాడకు విచ్చేయడం వేములవాడ పట్టణానికి దివ్య అవకాశం. స్వామివారికి ఘన స్వాగతం పలికే అదృష్టం మాకు లభించడం పుణ్యఫలం" అని మైలారం రాము పేర్కొన్నారు. మైలారం రాము ఆధ్వర్యంలో రజక సంఘ ప్రతినిధులు ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ను కలిసి స్వాగత ఏర్పాట్ల వివరాలు తెలియజేశారు. ప్రభుత్వ సూచనల మేరకు రజక సంఘం తరఫున సేవా కార్యక్రమాలు కూడా చేపట్టనున్నట్లు మైలారం రాము వెల్లడించారు.

# భూ భారతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలి



## జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) శుక్రవారం కోల్చారం మండల కేంద్రంలోనీ తహసీల్దార్ కార్యాలయాన్ని అకస్మాత్తుగా తనిఖీ చేశారు. భూ భారతి పెండింగ్ దరఖాస్తులను, భూ రికార్డులను, హాజరు పుస్తకాల్ని పరిశీలించారు. వివిధ భూ సమస్యలతో తహసీల్దార్ కార్యాలానికి వచ్చిన భూ బాధితులతో మాట్లాడారు. వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్ లో ఉన్న భూ భారతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. భూ సమస్యలతో వచ్చిన ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి వారి సమస్యలకు పరిష్కారాన్ని సూచించాలన్నారు. భూ సమస్యల వల్ల ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులు వారికి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో మళ్లీ గులాబీ జెండా ఎగురాలి.

## మాజీ డిప్యూటీ స్పీకర్ యం పద్మాదేవేందర్ రెడ్డి.

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్ గెలుపుతో జూబ్లీహిల్స్‌లో మళ్లీ గులాబీ జెండా ఎగురాలని మాజీ డిప్యూటీ స్పీకర్ యం పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఎర్రగడ్డ డివిజన్ లో శుక్రవారం ఇంటింటి ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్‌తో కలిసి మద్దతుగా మాజీ డిప్యూటీ స్పీకర్ ,మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు యం పద్మాదేవేందర్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ప్రజలకు సంక్షేమం, అభివృద్ధికి గోపీనాథ్ చేసిన సేవలను గుర్తు చేశారు. అదేవిధంగా మరోమారు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రజలను నయవంచన



చేసేందుకు ప్రచారం పేరుతో తిరుగుతున్న కాంగ్రెస్ నాయకులకు "బాకీ కార్డు" చూపించి ఆరు గ్యారంటీల అమలుపై నిలదీయాలన్నారు. అనంతరం పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ%రొ% 2023 శాసనసభ ఎన్నికల్లో అబద్ధపు హామీలతో తెలంగాణ ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో అభివృద్ధి జపం పటిస్తూ మరోమారు ప్రజలను నయవంచనకు గురి చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ నాయకుల దొంగ మాటలను నమ్మవద్దని జూబ్లీహిల్స్ నియోజకవర్గం ప్రజలు అప్రమత్తంగా ఉండి సునీతా గోపీనాథ్ ను గెలిపించుకున్నప్పుడే నియోజకవర్గంలోని ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. ఈ సందర్భంగా మాగంటి సునీతా గోపీనాథ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ళ. మల్లికార్జున్ గౌడ్, మాజీ కౌన్సిలర్ లు బీమారి. కిషోర్ , సోహెల్ ,నాయకులు ప్రభు రెడ్డి జుబేర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
శనివారం18 అక్టోబర్2025

## వరిధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఎం.ఎస్.పీ పరికరాల పంపిణీ

### ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మి మద్దతు ధరను పొందండి

### బోయినిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ : బోయిని ఎల్లేష్ యాదవ్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లిమండల పరిధిలో మార్కెటింగ్ సీజన్ వర్షాకాలం 2025-26 సంవత్సరానికి సంబంధించిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల సజావు నిర్వహణ కోసం అవసరమైన ఎం.ఎస్.పీ పరికరాలు పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రైతుల సౌకర్యార్థం టార్పాలిన్లు,మాయిశ్చర్ మీటర్లు,ఎలక్ట్రానిక్ కాంటాలు, ప్యాడీ క్లీనర్లు వంటి పరికరాలను ఐకేపీ,ప్యాక్స్ సంస్థలకు అందజేయడం జరిగిందని బోయినిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ వరిధాన్యాన్ని సమీపంలోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి అమ్మకాలు జరిపి, ప్రభుత్వ మద్దతు ధర (%మీస్రా%) పొందాలని రైతాంగానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

## నేటి బీసీల బంద్‌కు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు

### బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధానకార్యదర్శి : గుంటి శంకర్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలో నేడు శనివారం నిర్వహించే "బీసీ బంద్" కు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి గుంటి శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం నేడు తెలంగాణలో బీసీ సంఘాలు బంద్ నిర్వహిస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ బీసీ సంఘాలతో కలసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, బీసీ బంద్ శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ నాయకులను,కార్యకర్తలను, ప్రజలను గుంటి శంకర్ కోరారు.

## ముగ్గురు సంతానం ఉన్నవారికి ఎన్నికల అర్హతపై కాంగ్రెస్ నేతల హర్షం

### చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం కు సన్మానం - కృతజ్ఞతలు



గంగాధర (ప్రశ్న న్యూస్)ముగ్గురు సంతానం ఉన్న వారిని కూడా ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హులుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో శుక్రవారం గంగాధర మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి నేతృత్వంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ను శాలువాతో ఘనంగా సన్మానించి, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రమణారెడ్డి తో పాటుగా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు ఏనుగుల కనుకయ్య,కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ బోయినిపల్లి మండలాధ్యక్షులు ల్యాగల దేవయ్య,బోయినిపల్లి ఏఎంసి చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్,తదితర కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## యాదగిరి క్షేత్రంలో గొంగిడి దంపతుల పూజలు





యాదగిరిగుట్ట(ప్రశ్న న్యూస్) యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్, డిసిసిబి మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్ రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి సాంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో శ్రీస్వామి అమ్మవార్లు దర్శించుకుని, వచ్చే నెల నవంబర్ 7వ తేదీన గొంగిడి సునీత మహేందర్ రెడ్డి రెండవ కుమార్తె హర్షిత వివాహం నిహాంత్ తో జరగనున్న నేపథ్యంలో శ్రీస్వామి వారి పాదాల వద్ద మొదటి పత్రికను పెట్టి పూజలు నిర్వహించారు. శ్రీ స్వామివారిని దర్శించుకున్న గొంగిడి దంపతులకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా ప్రోటోకాల్ అధికారి రాజన్ బాబు శ్రీ స్వామివారి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. వారి వెంట బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కర్రె వెంకటయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీద రవీందర్ గౌడ్ ఉన్నారు.

# ముగ్గురు సంతానం ఉన్నవారికి ఎన్నికల అర్హత - కాంగ్రెస్ నేతల సంబరాలు

### సీఎం నిర్ణయానికి కృతజ్ఞతలు - సీఎం, ఎమ్మెల్యే సత్యం చిత్రపటాలకు పాలాభిషేకం



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)ముగ్గురు సంతానం ఉన్న వారిని కూడా ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హులుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో బోయినిపల్లి మండల కేంద్రంలో ఆనందోత్సాహ వాతావరణం నెలకొంది. సీఎం, మంత్రులు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు స్థానిక మండల కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేసి, టపాసులు పేల్చి ఘనంగా సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా నాయకులు ఏనుగుల కనుకయ్య మాట్లాడుతూ

"ప్రజాసేవ చేయాలనే తపన ఉన్న అనేకమంది నాయకులు ముగ్గురు సంతానం ఉన్న కారణంగా గతంలో పోటీ చేయలేక వెనుకబడ్డారు. ఇప్పుడు ఆ అడ్డంకిని తొలగించి అర్హత కల్పించడం ఎంతో సంతోషకరం. ప్రజాస్వామ్యంలో అందరికీ సమాన అవకాశాలు ఉండాలని ఈ నిర్ణయం సూచిస్తోంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, బీసీ,ఎస్సీ, ఎస్టీ గ్రామ జేఏసీ చైర్మన్ మాడిశెట్టి గంగయ్య, కొప్పుల బుచ్చి రాములు,మాడిశెట్టి జనార్ధన్,నల్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో పాత్రికేయ విలులువలను నీరుగారుస్తున్న నకిలీ జర్నలిస్టులు

### ఐడి కార్డుల వ్యాపారంతో జర్నలిజం విలువలు భ్రష్టు

### జర్నలిజం ముసుగులో వ్యాపారం - సమాజంలో విలువల క్షీణతపై వొడ్యాల వేణు ఆగ్రహం

### డబ్బు కోసం ఐడి కార్డులు జారీ చేసే దినపత్రికల యజమాన్యాలపై విమర్శలు

### జర్నలిజం అంటే సామాజిక బాధ్యత - వ్యాపారం కాదు

### సీనియర్ జర్నలిస్టు : వొడ్యాల వేణు స్పష్టం



వేములవాడ (ప్రశ్న న్యూస్)కనీస విద్యార్హతలు లేకుండా, జర్నలిజం పట్ల ఎలాంటి అవగాహన లేకుండా కేవలం రూ. 3 వేలు నుండి రూ. 5 వేలు చెల్లించి వివిధ దినపత్రికల యాజమాన్యాల వద్ద నుండి ఐడి కార్డులు సేకరించి "జర్నలిస్టులు"గా తిరుగుతున్నవారిపై సీనియర్ జర్నలిస్టు,ప్రజాప్రశ్న దినపత్రిక జిల్లా స్టాఫర్ వొడ్యాల వేణు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ

"ఇటీవలి కాలంలో జర్నలిజం అనే పవిత్ర వృత్తి విలువలు బలహీనమవుతున్నాయి. బట్టల దుకాణాలు,చికెన్ సెంటర్లు,ఎలక్ట్రీషియన్లు,ప్లంబర్లు, హోటల్ నిర్వాహకులు, మెకానిక్ లు,చిన్న వ్యాపారాలు నిర్వహిస్తున్న కొందరు వ్యక్తులు తాము జర్నలిస్టులమని చెప్పుకుంటూ సమాజంలో తిరుగుతున్నారు. వీరిలో చాలామంది వార్తా విలువలేమిటో, ప్రజా సమస్యలపై రిపోర్టింగ్ ఎలా చేయాలో కూడా తెలియదు. కానీ ఐడి కార్డు బలంతో తప్పుడు ప్రభావం చూపించి ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారు," అని పేర్కొన్నారు. ఇలాంటి వ్యక్తుల వల్ల అసలు జర్నలిస్టులు అవమానానికి గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు దినపత్రికల యాజమాన్యాలు కేవలం డబ్బు కోసం ఎవరు అడిగినా ఐడి కార్డులు ఇవ్వడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని తీవ్రంగా విమర్శించారు. జర్నలిజం అంటే కేవలం ఐడి కార్డు కాదు, అది ఒక సామాజిక బాధ్యత, ఒక నిబద్ధత అని ఆయన గుర్తుచేశారు. "జర్నలిజం అంటే ప్రజల సమస్యలను వెలికితీసి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం. కానీ కొందరు దానిని వ్యాపారంగా మలచి, జర్నలిజం పవిత్రతను దుర్వినియోగం చేస్తున్నారు," అని వొడ్యాల వేణు అన్నారు. భవిష్యత్తులో కనీస విద్యార్హతలతో పాటు జర్నలిజంపై ప్రాథమిక అవగాహన, వార్తా సేకరణపై ప్రావీణ్యత పరీక్షలు నిర్వహించిన తర్వాతే ఐడి కార్డులు జారీ చేయాలని పత్రికా యాజమాన్యాలకు విజ్ఞప్తి చేశారు.

అదేవిధంగా, రాష్ట్ర స్థాయి పత్రికా సంఘాలు కూడా ఈ విషయంలో ముందుకు వచ్చి, నకిలీ జర్నలిస్టుల వ్యవస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. "జర్నలిజం అంటే సమాజానికి అద్దం. ఆ అద్దం మసకబారితే ప్రజల నమ్మకం కోల్పోతుంది. అందుకే నిజమైన పాత్రికేయులు, పత్రికా సంస్థలు కలసి జర్నలిజం గౌరవాన్ని కాపాడాలి," అని వొడ్యాల వేణు పిలుపునిచ్చారు.

# కపాస్ కిసాన్ ద్వారా పత్తి కొనుగోలు కోసం స్లాట్ బుకింగ్ ప్రారంభం

### మార్చబడిన లేదా పనిచేయని మొబైల్ నెంబర్లు సరి చేసుకునేందుకు ఈనెల 23 వరకు అవకాశం

### మండల వ్యవసాయ అధికారి : ప్రణీత

### పలు గ్రామాల్లో పర్యటన - రైతుల నూతన మొబైల్ నెంబర్లు నమోదు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని దేశాయిపల్లి,కోరెం,తడగొండ,వెంకట్రావుపల్లి గ్రామాల్లో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి ప్రణీత వ్యవసాయ విస్తీర్ణ అధికారులతో కలిసి పర్యటించి,పత్తి సాగు చేస్తున్న రైతుల మారిన,పని చేయని మొబైల్ నెంబర్లను అప్డేట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం చేసే విధంగా, ఈ సీజన్‌లో కూడా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా ప్రత్తి కొనుగోళ్ల ప్రక్రియ నిర్వహించనుందని, రైతులు తమ ప్రత్తి పంటకు సంబంధించి స్లాట్ బుక్ చేసుకోవడానికి "కపాస్ కిసాన్ (%ఖుజూఖం ఖఱయఖఅ%)" ఆప్ ను గూగుల్ ప్లేస్టోర్ నుండి డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. రైతు భరోసా పోర్టల్‌లో రిజిస్టర్ అయిన మొబైల్ నంబర్ తో లాగిన్ అయ్యే విధానం ఇలా ఉంటుంది

ఆప్ లోకి ప్రవేశించి భాషను ఎంపిక చేసుకోవాలి (తెలుగు భాష అందుబాటులో ఉంది).

వెరిఫికేషన్ కోసం ఓటీపీ రైతు మొబైల్ నంబర్ కి పంపబడుతుంది.

లాగిన్ అయిన తర్వాత, రైతు సాగు చేసిన ప్రత్తి పంట విస్తీర్ణం ఖచ్చితంగా కనిపిస్తుంది.

ప్రత్తి కొనుగోలు ప్రక్రియకు ముందు, రైతులు ఇంటి నుంచే "బుక్ స్లాట్" విభాగంలో తమ గ్రామానికి అనుసంధానమైన జిన్నింగ్ మిల్లులను చూసి, తీసుకువెళ్లాలని అనుకున్న మిల్ ను ఎంపిక చేసుకొని, తేది సెట్ చేసి, స్లాట్ బుక్ చేసుకోవాలి. స్లాట్ బుక్ అయిన తరువాత, రైతుల మొబైల్ నంబర్లకు నిర్ధారణ మెసేజ్ వస్తుందన్నారు. బోయినిపల్లి మండలంలో సుమారు 6,500 ఎకరాల్లో ప్రత్తి పంట సాగు చేయబడిందని,కాగా కొంత మంది రైతుల మొబైల్ నంబర్లు మార్చబడినవి, లేదా పనిచేయకపోవడం వలన, ఈ నెల 23వ తేది లోగా తమ వివరాలను వ్యవసాయ విస్తీర్ణ అధికారులతో సంప్రదించి సరిచేయడం తప్పనిసరి అని మండల వ్యవసాయ అధికారి ప్రణీత తెలిపారు.

# నిందితునికి శిక్ష పడేందుకు కోర్టు డ్యూటీ అధికారి రమేష్ కృషి అభినందనీయం

### - దొంగతనాల కేసులో నిందితునికి జైలుశిక్ష

### - వేములవాడ రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ : చల్లా వెంకట్రాజం




వేములవాడ (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ రూరల్ మండల పరిధిలో గత సంవత్సరం జరిగిన మూడు దొంగతనాల కేసులో నిందితుడు శివరాత్రి సంపత్ (36) కి శనివారం వేములవాడ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఏ. ప్రవీణ్ ఒక సంవత్సరం జైలు శిక్ష విధించారని వేములవాడ రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ చల్లా వెంకట్రాజం తెలిపారు.

ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం, చెక్కపల్లి గ్రామం పెద్దమ్మ దేవాలయం,వట్టెంల గ్రామం పెద్దమ్మ దేవాలయం, ఎల్లమ్మ దేవాలయంలో జరిగిన దొంగతనాలపై కేసులు నమోదు అయ్యాయని, దర్యాప్తు క్రమంలో,శివరాత్రి సంపత్ తండ్రి కొమురయ్య (అంకుశపూర్, హుస్నాబాద్) కు చెందిన వ్యక్తి ఈ దోపిడి సంఘటనలకు బాధ్యుడని గుర్తించారు. అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఎస్ ఐ మారుతి కోర్టులో ఛార్జి షీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. విక్రాంత్ సాక్షుల విచారణను సమర్థంగా నిర్వహించి, నిందితుని శిక్ష పొందేలా చేయడం విజయవంతం చేశారు. ఇలాంటి కేసులో కోర్టు డ్యూటీ ఆఫీసర్ రమేష్ నిందితునికి శిక్ష పడేలా సహకరించినందుకు ఎస్ ఐ వెంకట్రాజం ఆయనను అభినందించారు.

## ధర్మపురి ఎమ్మార్వో కార్యాలయం ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ సత్య ప్రసాద్

**-భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి**

**-శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పునఃనిర్మాణం సంబంధించిన భూసేకరణ వేగవంతం చేయాలి**



జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్)జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ శుక్రవారం రోజున జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు.నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలపై ప్రతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మీసేవ సర్టిఫికెట్లను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సర్టిఫికెట్లను ప్రజలకు అందించవలసిందిగా అధికారులకు ఆదేశించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. తదుపరి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం పునఃనిర్మాణం పనులకు సంబంధించిన భూసేకరణ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.కలెక్టర్ వెంట జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్, ధర్మపురి మండలం ఎమ్మార్వో శ్రీనివాస్ మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల జిల్లాకు రాష్ట్ర స్థాయి ఉత్తమ పురస్కారం

**-బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు ఇస్తున్నట్లు తెలిపిన రాష్ట్ర కమిటీ**

**-జగిత్యాల ఐఎంఏ ప్రెసిడెంట్ డా జి హేమంత్, సెక్రటరీ డా ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, ట్రెజరర్ డా సుధీర్ కుమార్**

**-శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల ఐఎంఏ,జగిత్యాల జిల్లా వైద్యులు, ప్రజలు, నాయకులు**

జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్)వైద్య విధానాలలో మార్పులను ప్రభావితం చేయడం, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలలో ప్రభుత్వంతో కలిసి పని చేయడం, హెల్త్ క్యాంపులు, బ్లడ్ డొనేషన్ క్యాంపులు, క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు, వ్యాక్సిన్ క్యాంపులు నిర్వహించడం, మలేరియా డెంగీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను చేపట్టడం, సామాజిక భద్రతను కాపాడటం, ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ అందుబాటులో ఉండేలా చూడటం, వైద్యుల సమస్యలను పరిష్కరించడం,ప్రజలలో ఆరోగ్యం మరియు పోషకాహారంపై అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపట్టినందుకుగాను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ, జగిత్యాల జిల్లా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ను రాష్ట్ర స్థాయి ఉత్తమ పురస్కారానికి ఎంపికచేస్తూ బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు ఇస్తున్నట్లు స్టేట్ ఐఎంఏ ప్రెసిడెంట్ డా ద్వారకానాథ రెడ్డి, సెక్రటరీ డా అశోక్, ఫైనాన్స్ సెక్రటరీ డా దయాళ్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025 నవంబర్ 2న జరిగే ఐఎంఏ రాష్ట్ర 9వ వార్షికోత్సవంలో ఈ రాష్ట్ర స్థాయి ఉత్తమ పురస్కారాన్ని అందచేస్తారని తెలిపారు.జగిత్యాల ఐఎంఏ,జగిత్యాల జిల్లా వైద్యులు, ప్రజలు, నాయకులు, జగిత్యాల ఐఎంఏ ప్రెసిడెంట్ డా జి హేమంత్, సెక్రటరీ డా ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, ట్రెజరర్ డా సుధీర్ కుమార్ కు శుభాకాంక్షలు తెలిపారు.

# ఏకాదశి పురస్కరించుకొని లక్ష పుష్పార్చన





యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)ఏకాదశి పర్వదినాన్నిపురస్కరించుకుని యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహ ఆలయంలో స్వామి అమ్మవారులకు ఘనంగా లక్ష పుష్పార్చన పూజలు ఆలయ అర్చకులు సుమారు గంట పాటు,ప్రధాన ఆలయంలోని ప్రధాన ఆలయ ముఖమండపంలో లక్ష పుష్పార్చన పూజలు, పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం చేపట్టారు.ఆలయ అర్చకులు వేదపండితుల,వేద మంత్రోచ్చారణ చేత,సన్నాయి మేళం నడుమ ఆలయ సంప్రదాయం ప్రకారం ఈ ఉత్సవం శాస్త్రోక్తంగా జరిగింది.లక్ష పుష్పార్చన పూజల్లో పాల్గొన్న భక్తులకు, విశిష్టతను తెలియజేశారు.ఆలయంలోని వివిధ ఆర్జిత పూజల్లో కుటుంబ సభ్యులతో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

**అండల్ అమ్మవారికిఉంజల్ సేవోత్సవం..**

శ్రీ స్వామి వారి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మ వారికి ఊంజలి సేవోత్సవం పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం ఆలయ అర్చకులు నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. అమ్మవారికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.అమ్మవారిని ప్రధాన ఆలయం నందు అద్దాల మండపంలో అధిష్టింపజేసి ఊంజల్ సేవోత్సవం నిర్వహించారు.

# కార్మిక హక్కుల కోసం ఐక్యంగా పోరాటం :అశోక్




కాప్రా(ప్రశ్న న్యూస్) కార్మిక వర్గ సమస్యలను చర్చించి ఉద్యమ కార్యక్రమాలకు దిశానిర్దేశం చేయడానికి సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా
4వ మహాసభలు అక్టోబర్ 25, 26న చర్లపల్లి ఇండస్ట్రియల్ అసోసియేషన్ హాల్‌లో జరుగనున్నాయని జిల్లా అధ్యక్షుడు ఎ.అశోక్, కార్యదర్శి జె.చంద్రశేఖర్ లు తెలిపారు.శుక్రవారం కమలానగర్‌లోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా 4వ మహాసభలు అక్టోబర్ 25, 26న చర్లపల్లి ఇండస్ట్రియల్ అసోసియేషన్ హాల్‌లో జరుగుతాయి. ఈ సందర్భంగా 25వ తేదీన డాక్టర్ ఏఎస్ రావు నగర్ గ్రౌండ్ నుండి రౌండ్ బిల్డింగ్ దగ్గరలోని ఏపీఐఐసీకాలనీ వరకు కార్మికులతో భారీ ర్యాలీతో నిర్వహించి అనంతరం బహిరంగ సభ ఉంటుందన్నారు. కార్మిక చట్టాల పేరుతో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కొత్త లేబర్ కోడ్స్ తో పని గంటలు, సామాజిక భద్రత, ట్రేడ్ యూనియన్ హక్కులు, వీటి అమలుతో కాంట్రాక్ట్ ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, ప్రైవేట్ రంగ కార్మికులు, నిర్మాణ కార్మికులు అందరూ హక్కులు కోల్పోతారని హెచ్చరించారు. లేబర్ కోడ్స్ అమలు అంటే కార్మికులను అణగదొక్కే ప్రయత్నం. కార్మిక చట్టాలను రద్దు చేసి యజమానులకే అనుకూలంగా మార్చడం జరుగుతోంది. దీనివల్ల వేతనాలు తగ్గడం, ఉద్యోగ భద్రత లేకపోవడం, పెన్షన్ సౌకర్యం లేకపోవడం వంటి సమస్యలు మరింత పెరుగుతాయి అని నాయకులు అన్నారు. ప్రైవేటీకరణ, కాంట్రాక్టు విధానం, కార్మిక హక్కుల ఉల్లంఘన, నిరుద్యోగం వంటి సమస్యలతో కార్మికవర్గం తీవ్రంగా ఇబ్బందులు పడుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయి.
రాష్ట్ర ప్రభుత్వం 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ కనీస వేతనాలు జి ఓ లను సవరించకపోవడం, ఆర్థిక ఇబ్బందులకు కార్మికులకు గురవుతున్నారు. కనీస వేతనం 26వేల రూపాయలు చేయాలని డిమాండ్ చేశారు.
ఈ నేపథ్యంలో మహాసభల్లో సమగ్ర కార్యాచరణ రూపుదిద్దుకోనుంది అని చెప్పారు. కనీస వేతనం రూ.26వేలు అమలు, కాంట్రాక్ట్ కార్మికుల పర్మినెంట్ చేయడం, సామాజిక భద్రత, పెన్షన్ హక్కులు, మహిళా కార్మికుల రక్షణ, అసంఘటిత రంగ కార్మికుల హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై తీర్మానాలు ఆమోదిస్తామని తెలిపారు. పరిశ్రమలలో జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కొనేందుకు యూనియన్ స్థాయి అవగాహన, సంఘటిత పోరాటం అవసరం. వేలాది కార్మికులను సంఘటితం చేయడమే ఈ మహాసభల ప్రధాన లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జి.శ్రీనివాసులు, కోశాధికారి ఉన్నికృష్ణ, ఉపాధ్యక్షులు పి.గణేష్, బి.వి.సత్యనారాయణ, ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక



# నా విషయంలో అనుకున్నదాని కంటే ఎక్కువే జరిగింది



ఎవరి జీవితం ఎప్పుడు ఎలాంటి టర్న్ తీసుకుంటుందో చెప్పలేం. లైఫ్ లో ఏదీ ప్లాన్ చేసి రాదు అని అంటోంది మలయాళ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్. జీవితం ఊహించని మలుపులు తీసుకుంటుందని, అది మనల్ని ఎవరూ ఊహించని ప్రదేశాలకు తీసుకెళుతుందని చెప్పింది. తన కెరీర్ విషయంలో తన ఇమాజినేషన్ కు మించి జరిగిందని ఆమె కొత్త సినిమా బైసన్ ప్రమోషన్స్ లో భాగంగా ఓ సందర్భంలో తెలిపింది. అవును, కరక్టే ఆమె విషయంలో అదే జరిగింది. ఒక్కటైనా మంచి సినిమాలో నటించాలని కెరీర్ ప్రారంభించిన ఆమెకు, గడిచిన 10ఏళ్లలో అనేక మంచి క్యారెక్టర్లు పడ్డాయి. ఈ ఒక్క ఏడాదిలోనే అనుపమ కీలక పాత్ర పోషించిన డ్రాగన్, జానకీ వర్సస్ స్టేట్ ఆఫ్ కేరళ, పరదా, కిష్కిందపురి సినిమాలు థియేటర్లలో రిలీజ్ అయ్యాయి. ఈ నాలుగు సినిమాలు నాలుగు విభిన్న కథలు. నాలుగింట్లో అనుపమ నాలుగు వైవిధ్యమైన రోల్స్ చేసింది. ప్రభాస్ బర్త్ డే.. అంత రిస్క్ అయితే చేయరు కదా? ఇక ఈ ఏడాది ఆమె ఐదో సినిమా కూడా రానుంది. ఆమె హీరోయిన్ గా- చియన్ విక్రమ్ కుమారుడు ధ్రువ్ హీరోగా నటించిన బైసన్ రేపు థియేటర్లలోకి రానుంది. ఈ క్రమంలో సినిమా గురించి పలు విషయాలు అనుపమ షేర్ చేసుకుంది. ఈ నేపథ్యంలోనే విధి గురించి అనుపమ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. ఈ సినిమా డైరెక్టర్ మారి సెల్వరాజ్ తో గతంలో పెరియేరుమ్ పేరుమాల్ అనే తమిళ సినిమా మిస్ చేసుకుంది. దీంతో అనుపమ కొన్నేళ్లుగా నిరాశ చెందింది. ఆయనతో పని చేసే అవకాశం మళ్లీ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూసిందట. అలా కొన్నేళ్లకు మళ్లీ అదే డైరెక్టర్ తో బైసన్ లో నటించే ఛాన్స్ దక్కించుకుంది. ఈ విషయం గురించి మాట్లాడుతూ.. నేను ప్రేమమ్ చేసినప్పుడు, నాకు సినిమా గురించి ఏమీ తెలియదు. ప్రతిదీ కొత్తగా, ఏదో మాయాజాలంగా అనిపించింది. ఇప్పుడు పదేళ్ల తర్వాత, బైసన్ ఫొటో షూట్ సమయంలో నేను మళ్లీ అలాగే ఫీల్ అయ్యాను. అని అనుపమ చెప్పింది. అని తన పదేళ్ల కెరీర్ ను సింపుల్ గా వివరించింది. కాగా, ఇప్పుడు ఆమె కొత్త సినిమా బైసన్ విడుదలకు రెడీ అయ్యింది.

ే ం ే ఎ

థియేటర్లలోకి వస్తున్నా.. అనుమలో ఎలాంటి ఆందోళన, భయం కనిపించడం లేదు. ఆమె ప్రశాంతంగా ఉన్నట్లు అనిపిస్తుంది. అతిగా ఆలోచించడం లేదు. ఫలితం ఏదైనా స్వీకరించడానికి రెడీ అన్నట్లు కనిపించింది. ఆ క్రంలోనే విధి తనను ఊహకు మించి ఉన్నత శిఖరాల్లోకి తీసుకెళ్లిందని చెప్పింది.

# సాగర కన్యగా ఇస్మార్ట్ బ్యూటీ..!



ఒంటికి అంటుకుపోయినట్టుగా వేసుకున్న అమ్మడి డ్రెస్.. పరువాలకు పనిచెబుతూ నభా చేస్తున్న ఈ గ్లామర్ షో ఆమెకు మంచి మైలేజ్ తెచ్చి పెట్టేలా చేస్తుంది. ఇస్మార్ట్ బ్యూటీ నభా నటేష్ చేసిన తక్కువ సినిమాలతోనే తెలుగులో మంచి ఫాలోయింగ్ ఏర్పరచుకుంది. కన్నడలో వరుస 3 సినిమాలు చేసి ఆ తర్వాత తెలుగు తెరకు పరిచయమైన అమ్మడు ఐదేళ్ల కెరీర్ లో 7 సినిమాలు చేసింది. వాటిలో ఇస్మార్ట్ శంకర్ తప్ప మరో సినిమా ఆమెకు క్రేజ్ తీసుకు రాలేదు. 2021 లో మ్యాస్ట్రో సినిమా చేసిన నభా నటేష్ ఆ తర్వాత ఒక్క ఛాన్స్ కూడా అందుకోలేదు. మధ్యలో ఒక యాక్సిడెంట్ వల్ల ఆడియన్స్ కు దూరంగా ఉన్న అమ్మడు ఫైనల్ గా మళ్లీ తన గ్లామర్ ట్రీట్ తో అలరిస్తుంది. డంకీలో టామ్ క్రూజ్ స్టంట్ కావాలన్న ఫ్యాన్ సినిమాలు చేసినా చేయకపోయినా నభా నటేష్ సోషల్ మీడియాలో ఫోటో షూట్స్ మాత్రం అదరగొట్టేస్తుంది. అమ్మడు చేస్తున్న ఈ ఫోటో షూట్స్ చూసిన ఎవరైనా సరే ఆమె మాయలో పడక తప్పదు. సినిమా ఛాన్స్ లు రావట్లేదా లేక తనే కావాలని చేయట్లేదా అన్నది తెలియదు కానీ ఫోటో షూట్స్ తోనే సరి పెట్టుకుంటుంది నభా నటేష్. ఇక లేటెస్ట్ గా స్కిన్ టైట్ డ్రెస్ తో మరోసారి వావ్ అనిపించేలా చేసింది అమ్మడు. ఒంటికి అంటుకుపోయినట్టుగా వేసుకున్న అమ్మడి డ్రెస్.. పరువాలకు పనిచెబుతూ నభా చేస్తున్న ఈ గ్లామర్ షో ఆమెకు మంచి మైలేజ్ తెచ్చి పెట్టేలా చేస్తుంది. క్రీం కలర్ డ్రెస్ లో సాగర కన్యలా అలా నభా చూసే చూపులకు ఎలాంటి వారైనా సరే డిస్టర్బ్ అవ్వాల్సిందే అని చెప్పొచ్చు. సోషల్ మీడియాలో తన ఫోటో షూట్స్ వల్లే 5 మిలియన్స్ దగ్గర దాకా ఫాలోవర్స్ ని ఏర్పరచుకుంది అమ్మడు. ఏరుకున్న హీరో ప్రస్తుతం నభా నటేష్ లేటెస్ట్ ఫోటో షూట్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అమ్మడు చేస్తున్న ఈ ఫోటో షూట్స్ తోనే ఇంత హంగామా సృష్టిస్తుంటే నభా వరుస సినిమాలు చేస్తే మాత్రం స్టార్ రేంజ్ కి వెళ్లడం పక్కా అని చెప్పొచ్చు. ఇక అమ్మడి సినీ కెరీర్ అంత దూకుడుగా లేకపోయినా ఆమె చేస్తున్న ఫోటో షూట్స్ తోనే నభా గ్రాఫ్ పెరుగుతుంది. కచ్చితంగా కొద్దిగా వెయిట్ చేస్తే మాత్రం నభా నటేష్ కి మంచి అవకాశాలు వస్తాయని చెప్పొచ్చు. అప్పటిదాకా నభా నటేష్ ఫోటో షూట్స్ తోనే ఆమె ఫ్యాన్స్ అడ్జెస్ట్ అవ్వాల్సిందే మరి.

# రష్మికకు మద్దతుగా నాగచైతన్య-మృణాల్

రష్మిక మందన్న డీప్‌ఫేక్ వీడియో వైరల్ కావడంతో చాలా మంది కృత్రిమ మేధస్సును తప్పుగా ఉపయోగించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. అమితాబ్ బచ్చన్ మాత్రమే కాదు, రష్మిక మందన్న స్నేహితులు సహచరులు పెద్ద ఎత్తున మద్దతుగా ముందుకు వచ్చారు. రష్మిక డీప్‌ఫేక్ వీడియోని నిజమైనదిగా అమాయ ప్రజలు భావించే వీలుంది. అందుకే రష్మిక వెంటనే వీడియోపై స్పందించారు. ఇప్పుడు అక్కినేని నాగ చైతన్య సహా మృణాల్ ఠాకూర్, చిన్మయి శ్రీపాద వంటి చాలా మంది ప్రముఖులు కృత్రిమ మేధస్సు దుర్వినియోగం గురించి మాట్లాడటానికి ముందుకు వచ్చారు. %ూాంజవతీఅంవఎవల్ూాశ్రీంశీ =ముం% - రష్మిక ఫేక్ వీడియో.. ఒరిజినల్ గర్ల్ ఏమంది అంటే? మార్ఫింగ్ ఫోటోపై రష్మిక చేసిన ట్వీట్‌కు ప్రతిస్పందనగా నాగ చైతన్య ఇలా రాశాడు. "టెక్నాలజీని ఎలా దుర్వినియోగం చేస్తున్నారో చూడటం నిజంగా నిరుత్సాహపరుస్తుంది. భవిష్యత్తులో ఇది ఏ విధంగా అభివృద్ధి చెందుతుందోననే ఆలోచన మరింత భయానకంగా ఉంది. ఘటనపై చర్యలు తీసుకోవాలి.. ఇలాంటివి ఆపేందుకు చట్టం చేయాలి. దీని బారిన పడే వ్యక్తులను రక్షించడానికి చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి" అని రాసారు. తనకు మద్దతుగా నిలిచినందుకు చైతన్యకు రష్మిక ధన్యవాదాలు తెలిపింది.వార్నీ.. ఈ పొలిమేర చాలా దూరం వెళ్లేలా ఉందే! రష్మిక ఘటన అనంతరం మృణాల్ ఠాకూర్ సోమవారం అర్ధరాత్రి ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఒక నోట్ రాశారు. అందులో ఇలా ఉంది. "ఇలాంటివాటిని ఆశ్రయించే వ్యక్తులకు సిగ్గుండాలి. అలాంటి వారిలో మనస్సాక్షి అస్సలు ఉండదని ఇది చూపిస్తుంది. ఇప్పటివరకు మనం చాలా గ్లింప్సెస్ చూసిన ఈ సమస్యను పరిష్కరించినందుకు ఏరష్మిక మందనకు ధన్యవాదాలు. మనం మౌనంగా ఉంటున్నాం. ప్రతిరోజూ మహిళా నటీనటుల మార్ఫింగ్, ఎడిట్ చేయబడిన వీడియోలు ఇంటర్నెట్‌లో ప్రత్యక్షమవుతూనే ఉన్నాయి. అతుకులు వేసిన శరీర భాగాలను జూమ్ చేస్తూ.. సోషల్ మీడియాల్లో తిరుగుతూనే ఉన్నాయి. మనం ఒక సంఘంగా, సమాజంగా ఎటువైపు పయనిస్తున్నాము? అన్నది ముఖ్యం. మనం ప్రముఖంగా నటీమణులం కావచ్చు కానీ రోజు చివరిలో మనలో ప్రతి ఒక్కరూ మనుషులం. మనం దాని గురించి ఎందుకు మాట్లాడటం లేదు? మౌనంగా ఉండకండి.. ఇప్పుడు సమయం ఇంకా లేదు! అని మృణాల్ రాసారు. విశ్వక్ 'గామి'.. రన్ టైమ్ ఫిక్స్ దేశవ్యాప్తంగా అవగాహన కల్పించాలి ఈ విషయంపై అవగాహన కల్పించేందుకు గాయని చిన్మయి శ్రీపాద %శ%పై ఒక నోట్ రాశారు. ఆమె %శ% లో ఇలా రాసింది. "చాలా నెలల క్రితం, జైలర్ నుండి కావాలాకి ప్రదర్శించిన %ూూX% అవతార్‌లో మనందరికీ అత్యంత ఇష్టమైన నటీమణుల్లో ఒకరి వీడియో విడుదలైంది. అది ఆమె కాదు. ఇది డీప్ ఫేక్. కావాలా డీప్ ఫేక్ రెండరింగ్‌లో ఉపయోగించేందుకు శ్రీమతి సిమ్రాన్ తన పోలికను ముందుగానే అంగీకరించిందో లేదో ఎవరికీ ఖచ్చితంగా తెలియదు. ఆమె తన సోషల్ మీడియా పేజీలలో కూడా షేర్ చేసింది. నడుము, నాభి అందాలతో కవ్వింపులు ఇప్పుడు మరో డీప్‌ఫేక్ వీడియో తెరపైకి వచ్చింది. రష్మిక బాధితురాలు. నేను ఆమె ఇన్‌స్టాగ్రామ్ కథనాన్ని చూశాను. అక్కడ ఆమె నిజంగా కలవరపడుతోంది. ప్రతిరోజూ మహిళల శరీరాలు దోపిడీకి గురవుతున్న దేశంలో, డీప్ ఫేక్ వాళ్లు లక్ష్యంగా చేసుకోవడానికి వేధించడానికి బ్లాక్‌మెయిల్ చేయడానికి ఉపయోగించే నెక్స్ట్ లెవల్ ఆయుధం. అమ్మాయిలను బలవంతంగా దోచుకోవడం, బ్లాక్‌మెయిల్ చేయడం, అత్యాచారం చేయడం, ఒక చిన్న గ్రామం లేదా పట్టణంలోని వారి క్లూ లేని కుటుంబాలు మానమ్ లేదా గౌరవం ఎప్పుడు ప్రమాదంలో పడుతుందో అర్థం చేసుకోలేరు. రుణ యాప్‌లు పోర్న్ ఫోటోల ద్వారా వారి ముఖాల ఫోటోషాప్ చేసిన ఫోటోలతో రుణగ్రహీతలను వేధిస్తాయి. వారు దానితో వేగలేరు. కానీ ఒక డీప్ ఫేక్ అనేది సాధారణ శిక్షణ లేని కంటికి గుర్తించడం చాలా కష్టంగా ఉంటుంది. ప్రతి ఒక్కరికి అధిక-ప్రదర్శనలు ఉండవు. దేశవ్యాప్త అవగాహన ప్రచారం అవసరమని నేను నిజంగా భావిస్తున్నాను. దీని ద్వారా అవగాహన కల్పించడానికి అత్యవసరంగా ప్రారంభించాలి.





# బుల్లి తెర నటి సూపర్ హాట్ ట్రీట్!

బుల్లి తెర భామలు కూడా హీరోయిన్లకు ఏమాత్రం తక్కువ కాదు. అవకాశం రాక బుల్లి తెరపై ఉండాల్సి వచ్చింది. లేకుంటే? వెండి తెరపై అంతకు మించిన గ్లామర్ ట్రీట్ తో అలరించే భామలెంతో మంది ఉన్నారు. బుల్లి తెరపై గ్లామర్ కి ఆస్కారం లేదు కాబట్టి చాలా మంది భామలు ఆఫ్ ది స్క్రీన్ లోనూ అంతే ట్రెడిషనల్ గా కనిపిస్తుంటారు. ఆ ఫ్ ది స్క్రీన్ లోనూ బోల్డ్ బ్యూటీలుగా ఫేమస్ అయితే ఆ ప్రభావం సీరియల్స్ అవకాశాలపై పడుతుంది. డంకీలో టామ్ క్రూజ్ స్టంట్ కావాలన్న ఫ్యాన్ కానీ ఈ నటి మాత్రం అవేం పట్టించుకోకుండానే గ్లామర్ ఎలివేషన్ లో సత్తా చాటింది. 'గుప్పెడంత మనసు' సీరియల్ నటి జ్యోతిరాయ్ సుపరిచితులే. సీరియల్స్ లో వయసు ముదురిన పాత్రలు పోషిస్తుంటుంది. అమ్మ..అక్క.వదిన అంటూ డీసెంట్ పాత్రల్లో కనిపిస్తుంటుంది. కానీ సొగసరి ఆఫ్ ది స్క్రీన్ మాత్రం ఆ రోల్స్ కి భిన్నంగా గ్లామర్ ట్రీట్ తో అలరిస్తుంది. కన్నడ బోల్డ్ అటెంప్ట్ చూసి అంతా స్టన్ అవుతున్నారు. %ూాశ్రీంశీ =ముం% - థియేటర్లో విసిరేసిన డబ్బులు ఏరుకున్న హీరో వివరాల్లోకి వెళ్తే జ్యోతిరాయ్' ప్రెట్టి గర్ల్' అనే వెబ్ సిరీస్ లో నటిస్తోంది. అలాగే 'మాస్టర్ పీస్' అనే సినిమాలోనూ నటిస్తోంది. ఈ సినిమా దర్శకుడితో అమ్మడు డీప్ లవ్ లో ఉన్నట్లు కథనాలు వెడెక్కిస్తున్నాయి. తాజాగా అమ్మడు ఇన్ స్టాని షేక్ చేసే కొన్ని స్టిల్స్ లో నెటి జనుల ముందుకొచ్చేసింది. ఇదిగో ఇక్కడిలా స్కిన్ టైట్ ఫిట్ దుస్తుల్లో అందాల వడ్డనతో విందు ఇచ్చింది. నాభి అందాల్ని హైలైట్ చేస్తూ కెమెరాకి ఫోజులిచ్చింది. భారీగా మ్యాకప్ తో అమ్మడు వయసును పూర్తిగా దాచేసింది. ఈమె సీరియల్స్ చేసే జ్యోతిరాయ్ నా? అన్న సందేహం కలగక మానదు . ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. జ్యోతి ఫాలోవర్లు తనివి తీరా చూసి తరిస్తున్నారు. ఇలాంటి పిక్స్ మోర్ అండ్ మోర్ కావాలంటూ కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు.

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
శనివారం18 అక్టోబర్2025

## బీసీ రిజర్వేషన్ అంశంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పై ఒత్తిడి తీసుకురావాలి -నంది భట్టు నర్సింహ్మారాజు

### నేడు తెలంగాణ బంద్ కు పిలుపునిచ్చిన బిసి జేఏసీ



సంగారెడ్డి( ప్రశ్న న్యూస్)జెండా అజెండాలను వదిలి రిజర్వేషన్ల సాధనకై బీసీ లందరూ ఐక్యంగా ఉద్యమించాలి సంగారెడ్డి జిల్లా భట్రాజు సంఘం అధ్యక్షులు నందిభట్టు నర్సింహ్మారాజు అన్నారు. 42 శాతం పి సి రిజర్వేషన్ల అమలుకై బీసీ ఐక్యవేదిక బంద్ కు పిలుపునిచ్చిన సందర్భంగా సంగారెడ్డి జిల్లా భట్రాజు సంఘం పూర్తి మద్దతు తెలుపుతుందని ఈ సందర్భంగా అన్నారు. ఈ సందర్భంగా హై కోర్టులో బీసీ రిజర్వేషన్లు అడ్డుకున్న వారి పై ఆగ్రహం వ్యక్తం చేశారు.బీసీ రిజర్వేషన్ అంశం రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పై ఒత్తిడి తీసుకురావాలని బీసీ జేఏసీ తెలంగాణ బంద్ కు పిలుపునిచ్చిన సందర్భంగా
అక్టోబర్ 18న తలపెట్టిన తెలంగాణ బంద్ లో బీసీలందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలి తెలిపారు. బీసీ సంఘాల పిలుపుమేరకు బీసీల హక్కుల సాధన కోసం సకల జనులకు పిలుపునిస్తుందని, సామాజిక న్యాయం సమానత్వం రాజ్యాధికారం బీసీలకు దక్కాలని కళాశాలలు, పాఠశాలు, విద్యార్థులు తెలంగాణ ఉద్యమకారులు బీసీ లందరూ బంద్ కు మద్దతు తెలపాలని న్యాయం కోసం పోరాటం చేయకపోతే రేపటి తరానికి అన్యాయం చేసిన వాళ్ళమవుతామని 42 శాతం రిజర్వేషన్లు సాధించేంతవరకు పోరాటం చేయాలని బంద్ కు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలపడం సంతోషమని ఈ సందర్భంగా నర్సింహ్మా రాజు అన్నారు.

## పిల్లుల వల్ల గర్భస్రావాలు- దడ పుట్టిస్తున్న టాక్సోప్లాస్మోసిస్ ఇన్ఫెక్షన్లు- జర జాగ్రత్త!



పిల్లుల ప్రేమికులు పెరిగిపోతున్నారు. ఇళ్లలో వాటిని పెంచుకునే ట్రెండ్ ప్రస్తుతం పతాక స్థాయిలో ఉంది. ప్రత్యేకించి యూత్ ఈ దిశగా ఎక్కువ ఆసక్తిని కనబరుస్తున్నారు. భారీ రేట్లు పెట్టి మరీ పిల్లులను కొంటున్నారు. ఫ్రెండ్లీగా అందరితో కలిసిపోయే పిల్లులు ఇంట్లో ఉంటే ఆ లెక్కే వేరప్ప అంటున్నారు. వైద్య నిపుణులు మాత్రం డేంజర్ బెల్స్ మోగిస్తున్నారు. పిల్లి కరిచినా, గోళ్లతో గీరినా మంచిది కాదంటున్నారు. పిల్లుల వల్ల గర్భిణులకు గర్భస్రావాలు కూడా జరుగుతాయని హెచ్చరిస్తున్నారు. ఇంతకీ ఎందుకు? పిల్లుల్లో అంత డేంజరస్ కోణం ఏముంది? పెంపుడు పిల్లుల నిర్వహణలో ఏయే జాగ్రత్తలు తీసుకోవాలి? ఈ కథనంలో తెలుసుకుందాం.

మనదేశంలో చాలామంది ఇళ్లలో పెంచుకునే పెంపుడు జంతువుల జాబితాలో కుక్కలు, పిల్లులే ఎక్కువగా ఉంటాయి. గత కొన్నేళ్లలో పిల్లులను పెంచుకునే ట్రెండ్ బాగా పెరిగిపోయింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి సోషల్ మీడియా వేదికల్లోని పెంపుడు పిల్లుల కంటెంట్‌ను చూసి యువత ప్రభావితులు అవుతున్నారు. భారీ ధరలు పెట్టి మరీ పర్షియన్ క్యాట్స్ లాంటి విదేశీ జాతుల పిల్లులను కొంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో వీటి ధర కూడా ఎక్కువే ఉంది. ఈ పిల్లులకు పెట్టాల్సిన దాణా, ఇవ్వాల్సిన వ్యాక్సిన్ల రేట్లు కూడా ఎక్కువే ఉన్నాయి. అయినా పిల్లి ప్రియులు ఖర్చును అస్సలు లెక్క చేయడం లేదు.

పిల్లులను ఇంట్లో పెంచుకోవడం తప్పేమీ కాదు. అయితే వాటిని సరిగ్గా నిర్వహించాల్సి ఉంటుందనే విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి. వెటర్నరీ ఆస్పత్రికి తీసుకెళ్లి, వాటికి ఎప్పటికప్పుడు వ్యాక్సిన్లు వేయించాలి. పిల్లులకు నులి పురుగుల నివారణ మందులు వేయాలి. ఆరోగ్యకరమైన దాణాను అందించాలి. పిల్లుల ఉండే, తిరిగే ప్రదేశాలను చాలా జాగ్రత్తగా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలి. పిల్లుల మలమూత్రాల్లో ప్రమాదకరమైన పరాన్నజీవులు (పారసైట్లు) ఉంటాయి. వాటి వల్ల మనుషులకు ఇన్ఫెక్షన్లు సోకే అవకాశం ఉంటుంది. ఈ పరాన్నజీవుల కారణంగా గర్భిణులకు గర్భస్రావం జరిగ్గే ముప్పు ఉంటుందని జమ్మూకశ్మీరులోని శ్రీనగర్‌లో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అధిపతి, డాక్టర్ ఎం.సలీమ్ ఖాన్ ఈటీవీ భారత్‌కు తెలిపారు. పిల్లి మలం వల్ల మనుషుల ఆహారం, నీరు, పరిసరాలు కలుషితమైతే టాక్సోప్లాస్మోసిస్ ఇన్ఫెక్షన్ ప్రబలుతుందన్నారు. గర్భిణులు దీనిబారిన పడితే గర్భస్రావం జరిగే గండం ఉంటుందని పేర్కొన్నారు.టాక్సోప్లాస్మోసిస్ అనేది ఒక రకమైన ఇన్ఫెక్షన్. టాక్సోప్లాస్మా గోండి అనే పరాన్నజీవి (పారసైట్) వల్ల ఈ ఇన్ఫెక్షన్ కలుగుతుంది. సరిగ్గా ఉడికించని మాంసం తినడం వల్ల, పిల్లి మలాన్ని తాకినందువల్ల, పిల్లి మలం అవశేషాలు కలిసిన ఆహారం, నీటిని వినియోగించడం వల్ల ఈ ఇన్ఫెక్షన్ ప్రబలుతుంది. ఒకవేళ టాక్సోప్లాస్మోసిస్ ఇన్ఫెక్షన్ గర్భవతికి సోకితే, అది ఆమె కడుపులోని బిడ్డకు కూడా ప్రబలే రిస్క్ ఉంటుంది. ఇది సోకిన గర్భిణులలో తలనొప్పి, చర్మంపై దద్దుర్లు, తేలికపాటి జ్వరం, మానసిక ఆందోళన వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరిలో గర్భస్రావాలు కూడా జరగొచ్చు. ఈ ఇన్ఫెక్షన్ వల్ల పుట్టబోయే బిడ్డ శారీరక పెరుగుదల ప్రతికూలంగా ప్రభావితం అవుతుంది.పిల్లులు ఉండే గదిని, బాక్స్‌లను శుభ్రం చేసేటప్పుడు గర్భిణులతో పాటు మహిళలంతా జాగ్రత్తగా వ్యవహరించాలి. చేతి తొడుగులను, మాస్క్‌ను ధరించి ఇలాంటి పనులు చేయాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఈ పనులు చేశాక చేతులను సరిగ్గా కడుక్కోవాలని అంటున్నారు. అధికారిక సమాచారం ప్రకారం, జమ్మూకశ్మీరులో గత 3 నెలల్లో దాదాపు 1,864 మంది పెంపుడు పిల్లుల దాడుల్లో గాయపడ్డారు. బాధితుల్లో సగానికిపైగా (956 మంది) మహిళలే ఉండటం గమనార్హం. పిల్లుల దాడిలో గాయపడే గర్భిణులకూ టాక్సోప్లాస్మోసిస్ ఇన్ఫెక్షన్ ముప్పు ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు."ప్రతిరోజూ మా ఆస్పత్రి ఓపీడీకి 250 దాకా పెంపుడు జంతువులను ట్రీట్‌మెంట్ కోసం తీసుకొస్తున్నారు. వీటిలో 90 శాతం పిల్లులే ఉంటున్నాయి. జమ్మూకశ్మీరులో పిల్లులను పెంచుకునే ట్రెండ్ బాగా పెరిగింది. మనుషులను పిల్లి కరవడం హానికరం.

## విజ్ఞాన్ జ్యోతి గ్రామర్ హైస్కూల్ లో ఘనంగా దీపావళి




ఉప్పల్ (ప్రశ్న న్యూస్)హబ్సిగూడ డివిజన్ వెంకట్ రెడ్డి నగర్ లో విజ్ఞాన్ జ్యోతి గ్రామర్ హై స్కూల్ లో దీపావళి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు వివిధ రకాల పూలతో, రంగ వల్లికలు తయారుచేసి, దీపాలు వెలిగించి టపాకాయలు కాల్చారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ జ్యోతి పాఠశాల చైర్మన్ వేములకొండ సోమశేఖర్ గౌడ్, ప్రిన్సిపల్ రేణుక మాట్లాడుతూ చెడు పై మంచి సాధించిన విజయంగా అభివర్ణిస్తూ, పూర్వకాలంలో నరక చతుర్దశి రోజున, శ్రీ సత్యభామ శ్రీకృష్ణులు, నరరూప రాక్షసుడు అయినటువంటి నరకాసురుడు అనే రాక్షసుడిని సంహరించి, రాజ్యంలో ఉన్నటువంటి ప్రజలందరిని దుఃఖాన్ని పోగొట్టిన శుభదినం దీన్ని పురస్కరించుకొని ప్రజలందరూ సంతోషాలతో దీపాలని వెలిగించి, ఆట,పాటలతో దీపావళి పండుగ చేసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## సిటీ స్మాల్ కాసెస్ కోర్టు ఎన్నికల్లో విజయం సాధించిన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన చీఫ్ జస్టిస్ కుషా



హైదరాబాద్( ప్రశ్న న్యూస్)సిటీ స్మాల్ కేసెస్ కోర్టులో జరిగిన జుడిషియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎన్నికలలో అధ్యక్షురాలుగా కే. శ్రీలత, ప్రధాన కార్యదర్శిగా
ఎస్. మహేశ్వరి, అసోసియేట్ అధ్యక్షులుగా మహమ్మద్ ఇలియాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సి. హెచ్.భాను కిరణ్, కోశాధికారిగా ఆర్. అరుణాచలం, ఉపాధ్యక్షురాలుగాకె. సాయి శివాని, ఉపాధ్యక్షుడిగా కే. ప్రవీణ, ఉపాధ్యక్షుడిగా పి. మహేష్, సంయుక్త కార్యదర్శిగాకే. ప్రత్యూష, సంయుక్త కార్యదర్శిగా ఎస్. నాగరాజు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ అసోసియేషన్ బైలాస్ ప్రకారం ఉద్యోగుల శ్రేయస్సు కోసం కృషి చేస్తామని, సమష్టిగా ముందుకు సాగుతామని తెలిపారు.ఈ సందర్భంగా ఎన్నికైన కమిటీ సభ్యులను చీఫ్ జడ్జ్ కే. కుషా, మరియు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కే. శ్రీనివాస్ కమిటీ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు మరియు అభినందనలు తెలియ జేశారు.

## గుజరాత్ క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ- జడేజా భార్యకు మంత్రిపదవి

### హెూం శాఖ సహాయ మంత్రిగా ఉన్న హర్ష్‌సంఘవికి డిప్యూటీ సీఎం

గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటెల్ శుక్రవారం తన మంత్రి వర్గాలన్ని పునర్ వ్యవస్థీకరించారు. కొత్తగా 19 మంది ఎమ్మెల్యేను మంత్రులుగా చేర్చుకున్నారు. అంతేకాదు ఇప్పటి వరకు హెూం శాఖ సహయమంత్రిగా ఉన్న హర్ష సంఘవికి ఉపముఖ్యమంత్రి పదవిని అప్పగించారు. దీనితో ఆయన మంత్రి మండలి సంఖ్య 26కి పెరిగింది. గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ కొత్త మంత్రులతో పాటు క్యాబినెట్ హెూదా పొందిన సహాయ మంత్రులు, ఇండిపెండెంట్ ఛార్జ్ పొందిన మంత్రులతో ఇవాళ ప్రమాణ స్వీకారం చేయించారు.

**పదవులు ఎవరెవరికి వచ్చాయంటే?**

గురువారం 16 మంది మంత్రులు రాజీనామా చేసినప్పటికీ, ఓ ఆరుగురు మంత్రుల రాజీనామాలను ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఆమోదించలేదు. వారిలో సూరత్ నగరంలోని ముంజూరా అసెంబ్లీ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘవి ఒకరు. ఆయన ఇంతకు ముందు వరకు హెూంశాఖ సహాయ మంత్రిగా ఉండగా, తాజాగా ఆయనను డిప్యూటీ సీఎంను చేశారు. గత క్యాబినెట్‌లో ఉన్న మరో ఐదుగురు ఎమ్మెల్యేలను కూడా భూపేంద్ర తన కొత్త మంత్రి మండలిలోకి తీసుకున్నారు. వారిలో కనుభాయ్ పటేల్, రుషికేశ్ పటేల్, కున్వర్జీ బవాలియా- గతంలో క్యాబినెట్ మంత్రులుగా ఉండగా, సంఘవి, ప్రఫుల్ పన్సేరియా, పురుషోత్తం సోలంకి సహాయ మంత్రులుగా పనిచేశారు.

వీరిలో డిప్యూటీ సీఎంగా పదోన్నతి పొందిన సంఘవి, స్వతంత్ర మంత్రిగా ప్రమోట్ చేయబడిన పన్సేరియా మాత్రమే శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. మరోవైపు కొత్త మంత్రి మండలిలో చేరిన 19 మంది ఎమ్మెల్యేలలో జితు వాఘాని, అర్జున్ మోద్వాడియా, మనీషా వకీల్ ఉన్నారు.చాలా ఆశ్చర్యకరంగా, ఈసారి భారత క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య రివాబా జడేజా (34)ను ఈసారి సహాయ మంత్రిగా తీసుకున్నారు. జామ్‌నగర్ ఎమ్మెల్యేగా ఉన్న ఆమె ప్రమాణ స్వీకారానికి భర్త రవీంద్ర జడేజా, కుమార్తె నిధ్యాన హాజరయ్యారు. రవాబా తన తల్లిదండ్రులకు ఏకైక సంతానం. ఆమె రాజ్‌కోట్‌లో ఇంజినీరింగ్ డిగ్రీ చేశారు. ఆమె 2016లో రవీంద్ర



జడేజాను వివాహం చేసుకున్నారు.

గుజరాత్ కొత్త క్యాబినెట్ మంత్రుల ఫుల్ లిస్ట్ ఇదే!

భూపేంద్ర రజనీకాంత్ పటేల్
త్రికం బిజల్ ఛంగా
స్వరూప్‌జీ సర్దార్‌జీ ఠాకూర్
ప్రావెన్‌కుమార్ మాలి
రుషీకేశ్ గణేశ్‌భాయ్ పటేల్
పీసీ బరండా
దర్శన ఎం వాఘేలా
కాంత్రతలాల్ శివలాల్ అమృతియా
కున్వర్‌జీ భాయ్ మోహన్‌భాయ్ వవాలియా
రువాబా రవీంద్ర సిన్హా జడేజా
అర్జున్‌భాయ్ దేవభాయ్ మోద్వాడియా
డాక్టర్ ప్రద్యుమాన్ వాజా
కౌశిక్ కాంతిభాయ్ వేకారియా
పురుషోత్తంభాయ్ ఓ. సోలంకి
జితేంద్రభాయ్ సావ్జీభాయ్ వఘాని
రామన్‌భాయ్ భిఖాభాయ్ సోలంగీ
కమలేశ్‌భాయ్ రమేశ్‌భాయ్ పటేల్
సంజయ్‌సింహ రాజసింహ మహీదా
రమేశ్‌భాయ్ భూరాభాయ్ కటారా
మనీషా రాజీవ్‌భాయ్ వకీల్
ఈశ్వరసింహ ఠాకూర్‌భాయ్ పటేల్
ప్రఫుల్ పన్సేరియా
హర్ష సంఘ్వీ
డాక్టర్ జయరాంభాయ్ చేమాభాయ్ గమిత్
నరేశ్‌భాయ్ మగన్‌భాయ్ పటేల్
కానూభాయ్ మోహన్‌లాల్ దేశాయ్

ఇటీవల గుజరాత్ భారతీయ జనతా పార్టీ కొత్త రాష్ట్ర అధ్యక్షుడిగా మంత్రి జగదీష్ విశ్వకర్మ నియామకమయ్యారు. ఆయన నియామకం తర్వాత పార్టీతో పాటు ప్రభుత్వంలో మార్పులపై విస్తృతస్థాయిలో చర్చించారు. ఈ క్రమంలో పూర్తిగా మంత్రివర్గాన్ని విస్తరించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలోనే ఇంతకు ముందు ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మినహా, ఆయన ప్రభుత్వంలోని మంత్రలందరూ రాజీనామా చేశారు. తాజాగా కొత్త మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు.

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
శనివారం18 అక్టోబర్2025

## మల్లన్న సాక్షిగా నీచ రాజకీయాలు చేశారు

**–ప్రధాని మోదీపై ఎక్స్‌లో వైఎస్ షర్మిల విమర్శలు**



అమరావతి (ప్రశ్న న్యూస్) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కర్నూలు పర్యటనపై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రధాని పర్యటన ఒక "తుస్సుమన్న దీపావళి టపాసు"లాంటిదని ఆమె ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి బీహార్ ఎన్నికల కోసం కాషాయ వేషం కట్టారని, శ్రీశైలం మల్లన్న సాక్షిగా నీచ రాజకీయాలకు తెరలేపారని ఎక్స్ వేదికగా ఆరోపించారు. రాష్ట్ర ప్రజలను మరోసారి ఘరానా మోసం చేశారంటూ మండిపడ్డారు. శ్రీశైలం క్షేత్ర అభివృద్ధి విషయంలో ప్రధాని మోదీకి చిత్తశుద్ధి లేదని షర్మిల విమర్శించారు. "మల్లన్న ఆలయ అభివృద్ధికి ఒక్క రూపాయి అయినా ఇచ్చారా? రూ. 1,657 కోట్లతో పెండింగ్‌లో ఉన్న మాస్టర్ ప్లాన్ మీకు కనిపించలేదా?" అని ఆమె ప్రశ్నించారు. ఉజ్జయిని, వారణాసి కారిడార్ల అభివృద్ధిపై చూపుతున్న శ్రద్ధ శ్రీశైలం మల్లన్న కారిడార్‌పై ఎందుకు లేదని నిలదీశారు. శ్రీశైలం కారిడార్ నిర్మాణానికి కేంద్రం నుంచి అనుమతులు ఇవ్వడానికి ఎందుకు మనసు రావడం లేదని, ఇది మల్లన్నకు చేస్తున్న ద్రోహం కాదా? అని అన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంపై కూడా షర్మిల పలు ప్రశ్నలు లేవనెత్తారు. 11 ఏళ్ల క్రితం తిరుపతిలో చెప్పిన పాత పిట్టకథనే ప్రధాని మళ్లీ చెప్పారని విమర్శించారు. ఢిల్లీకి, రాష్ట్ర రాజధానికి లింక్ పెట్టారని, కానీ అరకొర అప్పులు ఇస్తే అమరావతి ఢిల్లీతో ఎలా పోటీ పడుతుందని ప్రశ్నించారు. కేవలం అప్పులకు హామీలు ఇచ్చినంత మాత్రాన రాష్ట్రం ప్రగతి పథంలో పరుగులు పెడుతుందా? అని నిలదీశారు. రాజధానికి లక్ష కోట్ల అప్పులు తెస్తే రాష్ట్ర ముఖచిత్రం ఎలా మారుతుందని, ప్రగతి ద్వారాలు ఎలా తెరుచుకుంటాయని ఆమె అన్నారు.

## అఖిల పక్షం పిలుపు..!!

## - బీసీ బంద్ ను జయప్రదం చేయండి..



జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) అక్టోబర్ 17 : బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) ఇచ్చిన నేటి తెలంగాణ రాష్ట్ర బంద్ ను జయప్రదం చేయాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం జూలూరుపాడు మండల కేంద్రంలో ఎవిఆర్ ఫంక్షన్ హాల్ లో నాయిబ్రహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కడియాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు పాల్గొని మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కేటాయిస్తూ జారీ చేసిన జీవో నెంబర్ 9ని సుప్రీంకోర్టు, హైకోర్టులు కొట్టివేయడం ప్రజా వ్యతిరేకమని, అభివృద్ధి నిరోధకమని, వెనుకబడిన వర్గాలను ఇంకా వెనక్కి నెట్టేసేదిగా ఉన్న ఈ తీర్పులను తీవ్రంగా నిరసిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని బీసీ జేఏసీ రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో ఈ రిజర్వేషన్లను చేర్చడం ద్వారా దీన్ని సాకారం చేయాలనే డిమాండ్ తో అక్టోబర్ నేడు తలపెట్టిన రాష్ట్ర బంద్ కు సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు. ఈ బంద్ సంపూర్ణంగా జరగడం కోసం ప్రజలు, ప్రజాస్వామికవాదులు, విద్యార్థి,మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదంచేయాలని పిలుపునిచ్చారు. బీసీలకు 42%రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినాయని అన్నారు. ఈ జీవోను రాష్ట్ర గవర్నర్,కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దీన్ని అమలులోకి రాకుండా రాష్ట్ర గవర్నర్, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దీన్ని అమలు కాకుండా తొక్కి పట్టడం సరైంది కాదని దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ ఎం ఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు ఏదులాపురం గోపాలరావు, సిపిఎం మండల కార్యదర్శి యాస నరేష్, సిపిఐ మండల నాయకులు యస్కె చాంద్ పాషా, న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి వల్లోజి రమేష్,బి ఆర్ ఎస్ మండల నాయకులు చేపలమడుగు రాంమూర్తి, కాంగ్రెస్ సేవాదళ్ మండల ప్రధాన కార్యదర్శి మాడుగుల నాగరాజు నాయిబ్రహ్మణ సంఘం మండల అధ్యక్షుడు కడియాలు శ్రీనివాస్, సిపిఐ నాయకులు గుడిమెట్ల సీతయ్య, మున్నూరు కాపు నాయకులు ఆదిమళ్ళ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### పెద్దఎత్తున దళితుల ఆత్మగౌరవ నిరసన..!!

### - తహసీల్దార్ కు వినతి పత్రం అందజేసిన ఎంఆర్పీఎస్ నాయకులు..




జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) అక్టోబర్ 17 : పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాలమేరకు ఎమ్మార్పీఎస్ జులూరుపాడు మండల అధ్యక్షుడు దెబ్బెందుల, సాయికుమార్ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జూలూరుపాడు మండలాల ఇన్చార్జి చంగల గురునాథం మాదిగ హాజరై మాట్లాడుతూ అక్టోబర్ 7, 2025 న భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయి బెంచ్ మీద లాయర్ల వాదనలు వింటున్న సమయంలో రాకేష్ కిషోర్ అనే వ్యక్తి షూస్ విసిరి దాడికి పాలు పడడాన్ని నిరసిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని. చీఫ్ జస్టిస్ మీద జరిగిన దాడి అనాగరికమైంది. ఈ దాడి సమస్త భారతీయులను దిగ్భ్రాంతికి గురి చేసిందని. దళిత, పీడిత వర్గాల ప్రజలను తీవ్ర మనోవేదనకు గురి చేసిందని. అందువల్ల దేశ ప్రజలందరూ ఈ దాడిని ఖండించారు. దళితుడైన బిఆర్ గవాయి సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ కావడం కొన్ని ఆధిపత్య శక్తులు జీర్ణించుకోలేకపోతున్నాయి. అందుకే అహంపూరితంగా ఈ దాడికి తెగపడ్డారని. కావున ఈ దాడికి పాల్పడ్డ వ్యక్తి మీద తక్షణమే కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలి. అలాగే దాడికి వెనుక ఉన్న శక్తులను గుర్తించి వారికి శిక్షలు పడేలా ఈ ఘటన మీద సమగ్రమైన దర్యాప్తు జరిపించాలని, అందుకోసం సుప్రీం కోర్టులో అనుభవం కలిగిన ప్రజస్వామిక దృక్పథం కలిగిన రిటైర్డు జడ్జీలను దర్యాప్తు కోసం నియమించాలని, అలాగే ఇలాంటి ఘటనలు ఉన్నత న్యాయవ్యవస్థల్లో పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని, ఈ డిమాండ్లను తక్షణమే పరిగణలోని తీసుకొని తగిన చర్యలు తీసుకోవాలని తమరి ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నాం అని తహసిల్దార్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం అనంతరం తహసిల్దార్కి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చాపలమడుగు నరసింహారావు, గార్లపాటి కృష్ణ, ఇస్సన్నపల్లి కళ్యాణ్ , జంగం నాగరాజు, కాకటి వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణం సీజ్ అంటే అర్థమేమిటో

**-సీజ్ చేసిన భవనాలలో యధాతధంగా నిర్మాణ పనులు**

**-సీజ్ రూపంలో సెటిల్మెంట్లకు పాల్పడుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు**

**-నిబంధనను పర్యవేక్షించడంలో పూర్తిగా విఫలమైన డిప్యూటీ, జోనల్ కమిషనర్లు**

**-చర్లపల్లి రహదారిపై సీజ్ చేసిన భవనంపై అధికారులకు ఎంత ప్రేమనో**









కాప్రా (ప్రశ్న న్యూస్) జిహెచ్ఎంసి నియమ నిబంధనలు అంటే మొదటగా చెత్త బుట్టలో వేసేది జిహెచ్ఎంసి అధికారులే ప్రజలు నియమనిబంధనలను పాటించని పక్షంలో చర్యలు తీసుకోవలసిన మున్సిపల్ అధికారులు లంచాలకు ఆశపడి ప్రభుత్వా నియమ నిబంధనను గాలికి వదిలేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తీవ్రస్థాయిలో అవినీతి ఉందంటే ఇప్పుడు రేవంత్ సర్కార్ వచ్చిన తర్వాత మరింత తీవ్రస్థాయిలో అవినీతి జరుగుతోంది. ముఖ్యంగా మున్సిపల్ శాఖలో అవినీతికి హద్దు అదుపు లేకుండా పోయింది. ఐఏఎస్ స్థాయి అధికారులు జోనల్ కమిషనర్లుగా విధులు నిర్వహిస్తూ అక్రమాలను కట్టడి చేయడంలో పూర్తిగా విఫలం చెందుతున్నారు. అక్రమ నిర్మాణాలను కట్టడి చేయడానికి జిహెచ్ఎంసి కమిషనర్ కఠినంగా వ్యవహరించాలని అక్రమ నిర్మాణాలను సీజ్ చేయాలని సర్క్యులర్ జారీ చేశారు. దానిని అమలుపరచడంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ లు, డిప్యూటీ కమిషనర్లు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించారు. అధికారుల బాధ్యత రాహిత్యంపై పలు పత్రికలు కథనాలు రాయడంతో మొక్కుబడిగా సీజ్ చేయడం అలవాటుగా చేసుకున్నారు టౌన్ ప్లానింగ్ అధికారులు. కేవలం లంచాలు తీసుకొని జిహెచ్ఎంసికి కోట్ల నష్టం చేస్తున్నారని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన పాలకులు స్పందించకుండా నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరించడంతో ప్రభుత్వ అధికారులలో అవినీతి తీవ్ర స్థాయికి చేరింది. మమ్ములను ఎవరు ఏం చేయలేరు అన్న ధీమా వచ్చేసింది దానితో అక్రమ నిర్మాణాలను సీజ్ చేస్తున్నామంటూ ఇలా సీజ్ చేస్తున్నారు అలా నిర్మాణ పనులు యధావిధిగా కొనసాగిస్తున్నారు. దీని వెనుక అధికారులకు భారీగా లంచాలు అందుతున్నాయి అన్నది బహిరంగ రహస్యమే. కాప్రా సర్కిల్ పరిధిలో చర్లపల్లి రహదారిపై రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని కమర్షియల్ భవనం నిర్మించడంతోపాటు అక్రమ అంతస్తులను నిర్మించారు ఈ అక్రమ నిర్మాణంలో స్థానిక కార్పొరేటర్ హస్తము ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చివరికి సర్కిల్ అధికారులు ఈ అక్రమ నిర్మాణం పై చర్యలు తీసుకోవాలని పత్రికలలో తీవ్రస్థాయిగా కథనాలు రావడంతో తప్పదులే అన్నట్లు మొక్కుబడిగా సీజ్ చేశారు. అయితే అక్రమ నిర్మాణదారుడు సీజ్ చేసిన ఫ్లెక్సీ ని స్టిక్కర్లను మరునాడే తొలగించి నిర్మాణ పనులు యధావిధిగా చేయించడం చూస్తుంటే అధికారుల మద్దతు ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవినీతి చేయాలంటే తెలంగాణ ప్రభుత్వంలో చాలా ఈజీ అన్నట్టుగా మారింది పరిస్థితి. అధికారులకు, పాలకులకు లంచాలు ఇస్తే ఎలాంటి అవినీతికైనా పాల్పడవచ్చు అన్నది ఈ అక్రమ నిర్మాణం నిరూపిస్తోంది. సీజ్ చేసిన పనులు జరుగుతున్నాయని పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన చూస్తాం, చేస్తామంటూ కాకమ్మ కథలు చెప్పడం తప్ప చర్యలు తీసుకున్న పాపాన పోవడం లేదు.

**అధికారుల దృష్టిలో సీజ్ చేయడమంటే అర్థమేమిటో**

కాప్రా సర్కిల్ పరిధిలో సీజ్ చేయకుండా చాలా అక్రమ నిర్మాణాలను, అక్రమ షెడ్లను వదిలేశారు అధికారులు. మొక్కుబడిగా ఒకటి, రెండు చేసిన వాటి నిర్మాణ పనులు యధావిధిగా జరుగుతున్నాయి. ఈ అక్రమాలను డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్తే మీరు చెప్పారు కదా మేము చూసుకుంటాం అని చెప్పడం తప్ప చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. డిప్యూటీ కమిషనర్ నిర్లక్ష్యంతోనే ఈ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని నోడల్ అధికారిగా ఉంటున్న డిప్యూటీ కమిషనర్లు టౌన్ ప్లానింగ్ అధికారులు ఏకమై బాధ్యతారాహిత్యంగా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఒక అక్రమ నిర్మాణం సీజ్ చేసిన తర్వాత కూడా బహిరంగంగా రహదారిపై నిర్మాణ పనులు చేస్తూ జిహెచ్ఎంసి చట్టానికే సవాల్ విసురుతున్నారంటే ఇక అధికారులు ఉండి ఏం ఉపయోగం వీళ్లకు లక్షలు జీతాలు ఇస్తున్న ప్రభుత్వానికి ఏం ఉపయోగమే రేవంత్ ప్రభుత్వంలో ఉన్న పెద్దలకే తెలియాలి కమిషనర్ పట్టించుకోరు, జోనల్ కమిషనర్ అసలే పట్టించుకోరు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా పట్టించుకోదు. ఇక ఎవరు పట్టించుకుంటారు అందుకోసమే జోరుగా అక్రమ నిర్మాణాలు వాళ్ళే హ్యాపీగా చేసుకుంటున్నారు ప్రభుత్వ ఆదాయానికి మాత్రం భారీగా గండికోడుతున్నారు. అయిన ప్రభుత్వ పాలకులు స్పందిస్తే తప్ప అవినీతిని అక్రమాలను కట్టడి చేయలేమన్నది అందరికీ తెలిసిన విషయమే వాళ్ళు స్పందించరు అవినీతి కట్టడం చేయరు. ఏదైనా సమావేశాలలో అవినీతిపై మాట్లాడుమంటే గంటలకొద్దీ ధారాళంగా మాట్లాడుతారు కట్టడి చేయడంలో మాత్రం పూర్తిగా విఫలం చెందారు ఇలా ఉంది మన జిహెచ్ఎంసి లో అవినీతి పరిస్థితి.

# నగరం నడిబొడ్డున ఆక్రమణల పర్వం

**-గోషామహల్ కుల్సుంపురాలో కబ్జాలను తొలగించిన హైడ్రా**





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ భూములను రక్షించడంలో హైడ్రా కీలక పాత్ర వహిస్తున్న కబ్జాదారులు మాత్రం లెక్క చేయడం లేదు. కొంతమంది కబ్జాదారులు హైడ్రా తో సంబంధాలు ఉన్నాయంటూ మమ్ములను ఏం చేయలేరంటూ అసైన్డ్ భూములను కూడా కబ్జా చేసి అక్రమ అపార్ట్మెంట్లో నిర్మిస్తున్నారు మరి వీటిపై హైడ్రా చర్యలు తీసుకోకపోవడం అటువైపు కన్నీటి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. హైదరాబాద్ నగరంలోని కుల్సుంపురాలో దాదాపు రూ. 110 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా పరిరక్షించింది. గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని కుల్సుంపురాలో జరిగిన ఆక్రమణలను తొలగించి, 1.30 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. ప్రజావసరాల కోసం ఈ భూమిని ఉపయోగించాలని ప్రభుత్వం గతంలో భావించింది. ముఖ్యంగా, ఈ స్థలాన్ని డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి కేటాయించే యోచనలో ప్రభుత్వం ఉంది. ఈ నేపథ్యంలో, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ఈ భూమిని పరిరక్షించాల్సిందిగా హైడ్రాను కోరారు. స్థానికులు కూడా భూ ఆక్రమణలపై హైడ్రాకు ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు శుక్రవారం హైడ్రా సిబ్బంది ఆక్రమణలను తొలగించారు. అయితే, అశోక్ సింగ్ అనే వ్యక్తి ఈ భూమి తనదని వాదిస్తున్నాడు. ఈ క్రమంలో, సిటీ సివిల్ కోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వెలువరించింది. ఇదివరకే రెవెన్యూ అధికారులు రెండుసార్లు ఈ భూమిలో ఆక్రమణలను తొలగించారు. అయినప్పటికీ, అశోక్ సింగ్ ఆ స్థలాన్ని ఖాళీ చేయలేదు. అంతేకాకుండా, ఖాళీ చేయించేందుకు ప్రయత్నించిన అధికారులపై దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. అశోక్ సింగ్‌పై లంగర్‌హౌస్, మంగళ్‌హాట్, షాహినాయత్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లలో ఎనిమిదికి పైగా కేసులు నమోదయ్యాయి.

# రాజకీయ నాయకుల పేరుతో అక్రమ నిర్మాణాల జోరు

**-జిహెచ్ఎంసి నిబంధనలలో రాజకీయ నాయకులకు సడలింపు ఉందా.?**

**-నోటీసులు ఇచ్చిన కూల్చివేయడానికి వెనుకడుగు వేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు**

**-సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడదు అవినీతి ఆగదు**

**-డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు సీరియస్ గా ఉన్న లెక్కచేయని టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది**



సీతాఫలమండి (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల పరంపర కొనసాగుతుంది. అక్రమ నిర్మాణాలపై డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు సీరియస్ గా ఉన్న టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇబ్బంది మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కమిషనర్ కు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేసిన అసలు పట్టించుకోవడంలేదని డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్ లు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఎన్ని ఆదేశాలు జారీ చేసిన అసలు లెక్కచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏసిపి సమయంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా ఉండడంతో వచ్చిన ఫిర్యాదులన్నీ బుట్ట దాకాలేనా అంటూ ఫిర్యాదుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీతాఫలమండి, బౌద్ధ నగర్ డివిజన్ పరిధిలో రాజకీయ నాయకులు పార్టీల పేరు చెప్పి పబ్బం గడుపుతున్నారని మరికొంతమంది ప్రజాప్రతినిధుల అండదండ ఉంది అంటూ అధికారులను సైతం లెక్క చేయకపోవడం ఇక్కడ సర్వసాధారణంగా మారింది. అందులో భాగంగా బాపన్ బస్తీలోని పక్కింటి నెంబర్ 12-11-135 చిన్న గల్లీలో 5 అంతస్తుల అక్రమ నిర్మాణం పై స్థానికులు ఎన్ని ఫిర్యాదులు చేసిన పత్రికలో కథనాలు వచ్చిన, సెప్టెంబర్ 24వ తేదీన ప్రజా ప్రశ్న దినపత్రికలో కథనం వచ్చిన అధికారులు రాజకీయ నాయకుల పేరు చెబుతూ మౌనంగా ఉంటున్నారని మరి రాజకీయ నాయకులకు జిహెచ్ఎంసి చట్టంలో ప్రత్యేక సడలింపు ఉందా.? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు అక్రమ నిర్మాదారులతో చేతులు కలపడం వల్లే ఇలా నిర్లక్ష్యం చేస్తున్నారని రాజకీయ నాయకులు ఎలాగో అక్రమ నిర్మాణదారులతో చేతులు కలిపి వాళ్లకు అండగా ఉంటూ అధికారులను బెదిరించుచు అక్రమ నిర్మాణాలను చేయించడం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పరిపాటిగా మారింది. కానీ కొంతమంది అధికారులు ప్రభుత్వ నియమ నిబంధనలకు ప్రాధాన్యతీస్తూ రికమండేషన్స్ పక్కన పెట్టి ప్రభుత్వానికి ఆదాయం చేకూరె విధంగా చేస్తుంటే మరికొంతమంది అధికారులు జిహెచ్ఎంసి నిబంధన లు తుంగలో తొక్కి రాజకీయ నాయకుల తొత్తులుగా మారి అక్రమ నిర్మాణాలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు ఇక సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు మాత్రం కొదవ లేకుండా పోయింది. రాజకీయ నాయకుల ముసుగులో జిహెచ్ఎంసి నిబంధనలను తుంగలో తొక్కుతున్న నాయకులు ఉన్నారు. కొంతమంది నాయకులుగా కండువా కప్పుకొని ప్రజాప్రతినిధులకు తొత్తులుగా పనిచేస్తూ అక్రమ నిర్మాణాలు చేయించుకోవడానికి ఇలాంటి చిల్లర దందాలు చెస్తున్నారని నాయకులు వాళ్లకు ముఖ్యం కాదు అధికారంలో ఏ నాయకుడు ఉంటే వాళ్ళ అడుగులకు మడుగులోతుతు పాద సేవ చేసుకుంటూ అక్రమ నిర్మాణాలు చేయిస్తూ అపార్ట్మెంట్లు నిర్మించుకుంటూ కోట్లు గడిస్తున్నారు. సొసైటీలో మాత్రం కధర్ చోక్కలు వేసుకుని నాయకుల వలె బిల్డప్ ఇస్తూ చిల్లర వేషాలు వేస్తే చిల్లర గాళ్లు ఇటీవల భారీగా పెరిగారని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి చిల్లరగాలను కొంతమంది రాజకీయ నాయకులు వెనుకేసుకుని రావడం వల్లే జిహెచ్ఎంసి పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరుగా పెరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన సికింద్రాబాద్ సర్కిల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఎసిపి, డిప్యూటీ కమిషనర్ కఠినంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers".H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588